ప్రజాశక్తి

ఆదివారం 15 సెప్టెంబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

సన్యాసిరావు మృతి కళారంగానికి తీరనిలోటు

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం



సన్యాసిరావు పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న లోకనాథం, జగ్గునాయుడు తదితరులు



సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - గాజువాక, విశాఖ కలెక్టరేట్ : ప్రజా గాయకుడు, కవి, రచయిత, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు జి.సన్యాసిరావు మృతి కళారంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న సన్యాసిరావు శనివారం గాజువాకలోని తన చిన్న కుమారుడు సుందరయ్య ఇంటి వద్ద మృతిచెందారు. ఆయన పార్థివదేహాన్ని గాజువాక నుండి కెజిహెచ్‌కు అంతిమయాత్రగా తీసుకొచ్చారు. అనంతరం అనాటమీ డిపార్టుమెంటుకు పరిశోధనల నిమిత్తం అప్పగించారు. సన్యాసిరావు సంతాప సభ గాజువాకలోని ఆయన కుమారుని ఇంటి వద్ద నిర్వహించారు. తొలుత సన్యాసిరావు పార్థివ దేహం వద్ద పలువురు నివాళి అర్పించారు. సంతాప సభలో లోకనాథం మాట్లాడుతూ విశాఖలో సిపిఎం, పిఎన్ఎం కార్యక్రమాలు, ఉద్యమాలు ఎక్కడ జరిగినా అక్కడ కచ్చితంగా సన్యాసిరావు ఉండేవారన్నారు. ఆయన పాటతో ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లారని తెలిపారు. ఆయన ధన్యజీవని కొనియాడారు. ఆయన పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం కెజిహెచ్‌కు అప్ప గించిన కుటుంబ సభ్యులను అభినం దించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు మాట్లాడుతూ సన్యాసిరావు జ్ఞాపకాలు ఎవ్వరినీ వీడిపోవన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు పోరాడిన వ్యక్తి అని తెలిపారు. ఆయన పాటలు ఎందరిలోనో చైతన్యం రేకెత్తించాయన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, గాజువాక, స్టీల్ డివిజన్ కార్యదర్శులు ఎం.రాంబాబు, శ్రీనివాసరాజు, నాయకులు ఎం.రాజు ప్రసాద్, పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, ఐద్వా జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చంటి మాట్లాడుతూ గొప్ప కళాకారున్ని, చైతన్య శీలిని కోల్పోయామన్నారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో మల్కాపురం జోన్ కార్యదర్శి ఎం.పైడిరాజు, నాయకులు జె.కోటేశ్వరరావు, పి.కోటేశ్వరరావు, మిగతా 2లో..

సత్వర న్యాయమే లోక్ అదాలత్ ధ్యేయం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



మాట్లాడుతున్న గిరిధర్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కక్షిదారులకు సత్వర న్యాయం అందించడమే లోక్ అదాలత్ ధ్యేయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పేర్కొన్నారు. ప్రజలు, కేసులతో సంబంధం ఉన్న కక్షిదారులు, వివిధ శాఖలు తమ కేసులను పరిష్కరించుకునేందుకు ఇదొక మంచి వేదికని, ఇలాంటి వేదికలను తప్పక సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జాతీయ లోక్ అదాలత్ ప్రారంభోత్సవ కార్యక్రమం స్థానిక కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవాసదన్ వద్ద శనివారం ఉదయం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ కక్షిదారులను ఉద్దేశించి మాట్లాడారు. దేశ, రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానాల ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని న్యాయస్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇనుస్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరించబడతాయని ఆయన వివరించారు. కావున కక్షిదారులు పెద్ద ఎత్తున కేసులను రాజీచేసుకొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. తొలుత రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి అమరావతి నుంచి ప్రారంభించిన డిజిటల్ జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ పాల్గొన్నారు. అనంతరం జిల్లా కార్యక్రమాన్ని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ప్రారంభించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి. శేషమ్మ, కమర్షియల్ కోర్టు జడ్జ్ కేశవ చార్యులు, మహిళా కోర్టు జడ్జ్ బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

▶ వార్త 4లో..

అక్టోబర్ 19, 20 తేదీల్లో ఐసిఐయు మహాసభలు

▶ వార్త 4లో..

నవంబర్ 29 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

▶ వార్త 2లో..

స్టీల్‌ప్లాంట్ బలోపేతానికి చర్యలు చేపట్టాలి

సిఎం చంద్రబాబుకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక లేఖ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని, మూసేయాలని కేంద్ర ప్రభుత్వం గతంలోనే నిర్ణయించి, స్పష్టంగా ప్రకటించిన నిర్ణయానికి వ్యతిరేకంగా మూడున్నర సంవత్సరాలకుపైగా కార్మికులు, రాష్ట్ర ప్రజలు పోరాడుతున్నారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజ శర్మ శనివారం ఒక లేఖలో గుర్తుచేశారు. ప్లాంట్ బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కోరారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలిస్తే స్టీల్‌ప్లాంటును కాపాడతామని ఎన్‌డిఎలో భాగస్వాములుగా సిఎం చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని నమ్మి ప్రజలు కూటమికి అనుకూలంగా పెద్ద ఎత్తున తీర్పునిచ్చారని, గాజువాక అసెంబ్లీ, విశాఖపట్నం పార్లమెంటు నియోజకవర్గాలలో ఆ పార్టీ అభ్యర్థులు రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీలతో గెలవడానికి ఇదే ప్రధాన కారణమని అన్నారు. టిడిపి, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ముఖ్యమంత్రి ఢిల్లీలో దేశ ప్రధానిని కలిసి రాష్ట్ర సమస్యలను ప్రస్తావించినప్పుడు విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ అంశాన్ని కనీసంగా కూడా మాట్లాడలేదన్నారు. అదే విధంగా అమరావతిలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కలిసినప్పుడు, వారిని గంటల తరబడి నిరీక్షించేలా చేసి ఆఖరుకు లాభాలు తీసుకురండి, అప్పుడు చూద్దామని సెలవిచ్చారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఒక పక్కన ముడిసరుకు సరఫరా కూడా లేకుండా ఉద్దేశపూర్వకంగానే పీక నులిమేస్తుంటే, లాభాలు ఎలా తీసుకొస్తారో ముఖ్యమంత్రి తెలియజేయాలన్నారు. ఈ రెండు విషయాలను ఒక దగ్గర పెట్టి చూస్తే, ముఖ్యమంత్రి కూడా కేంద్ర ప్రభుత్వ నిర్ణయానికి వంత పాడుతూ, ఇచ్చిన హామీకి తిలోదకాలు ఇస్తున్నారనే అనుమానం ప్రజలకు కలగడం సహజమన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను మిగతా 2లో..

వైజాగ్ కంటైనర్ టెర్మినల్‌లో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్‌లో శనివారం అగ్నిప్రమాదం సంభవించింది. అయితే ఇది చాలా చిన్న ప్రమాదమని, పలు ఛానళ్లలో భారీ ప్రమాదం సంభవించిందని, అందులో రజనీకాంత్ చిత్ర బృందానికి ప్రమాదం తప్పిందని వచ్చిన వార్తల్లో ఎటువంటి వాస్తవమూ లేదని, షూటింగ్ జరుగుతున్న ప్రాంతం ప్రమాదం జరిగిన ప్రాంతానికి చాలా దూరంగా ఉందని విశాఖ కంటైనర్ ప్రైవేట్ లిమిటెడ్ పబ్లిక్ రిలేషన్స్ సీనియర్ జనరల్ మేనేజర్ ఎంఎన్.రావు ఒక ప్రకటనలో తెలిపారు. వారం రోజుల క్రితం చైనా నుండి వచ్చిన ఒక కంటైనర్‌లో ఇవి వాహనాల్లో ఉపయోగించే లిథియం బ్యాటరీలు ఉన్నాయని. ఆ కంటైనర్ నుంచి పొగతో కూడిన అగ్గి వచ్చి ప్రమాదం సంభవించిందని, వెంటనే అప్రమత్తమైన సిబ్బంది పొగను గమనించి కంటైనర్‌ను వేరుచేసి రక్షణ చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ కంటైనర్ కొల్‌కతా వెళ్లాల్సి ఉండగా మధ్య మార్గంలో విశాఖలో అన్‌లోడ్ చేశారని ఆయన తెలిపారు.

సమగ్ర దర్యాప్తు జరపాలి : సిఐటియు

విశాఖ కలెక్టరేట్ : విసిటిపిఎల్‌లో 40 అడుగుల కంటైనర్‌లో శనివారం ఉదయం 10 గంటల సమయంలో జరిగిన అగ్నిప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని విశాఖ పోర్టు స్టీవ్ డోర్ అండ్ మోటార్ ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) అధ్యక్షులు బి.జగన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఎవర్నీ లోపలికి పంపించకపోవడంతో అనుమానాలకు మరింత ఊతం లభిస్తోందని తెలిపారు. సమగ్ర దర్యాప్తు అవసరమన్నారు.

మొదటి పేజీ తరువాయి..



సన్యాసిరావు పార్థివ దేహాన్ని పరిశోధనల నిమిత్తం అప్పగిస్తున్న కుటుంబ సభ్యులు

సన్యాసిరావు మృతి కళారంగానికి తీరనిలోటు

పల్లెల నర్సింగరావు, ఎ.లోకేశ్వరరావు, కె.కిరీటం, కె.సంతోషం, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి, సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్షులు ఆర్.శంకరరావు, ప్రజానాట్యమండలి నాయకులు పివైవి.రమణరావు, నాగేశ్వరరావు, వార్వా - నివాస్ నాయకులు డాక్టర్ రమేష్ కుమార్, ప్రజానాట్య మండలి కళాకారులు, నాయకులు పాల్గొన్నారు. సన్యాసిరావు మృతికి సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, సీనియర్ నాయకులు ఎ.అజశర్మ, రెడ్డిపల్లి బాబూరావు, ఎన్.కృష్ణమూర్తి, అరుణ్‌జీ, జి.రమణ, బి.పద్మ, లీలావతి, బాషా, మౌలాలి, దండు నాగేశ్వరరావు, పి.మణి, ఆర్.భాగ్యలక్ష్మి, జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ కార్యదర్శి వి.ప్రభావతి సంతాపం తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ బలోపేతానికి చర్యలు చేపట్టాలి

కాపాడుకోలేకపోతే అంతకంటే రాష్ట్రానికి ద్రోహం మరొకటి ఉండదన్నారు. తెలుగు ప్రజల పోరాడి సాధించుకున్న ఈ ప్లాంట్‌ను కాపాడుకోకపోతే చరిత్ర క్షమించదని తెలిపారు. అందువల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్రంపై స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఒత్తిడి తేవాలని కోరారు.



ప్రాపర్టీ షో వివరాలు వెల్లడిస్తున్న క్రెడాయ్ ప్రతినిధులు

నవంబర్ 29 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : నవంబర్ 29 నుంచి మూడు రోజుల పాటు నగరంలోని గాదిరాజు ప్యాలెస్‌లో క్రెడాయ్ ఆధ్వర్యంలో ప్రాపర్టీ షో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. శనివారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బ్రోచర్ విడుదల చేశారు. సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఇదో వేదికని తెలిపారు. ఇళ్ల నిర్మాణదారులకు అన్ని విషయాల్లోనూ అవగాహన కల్పించేందుకు నవంబర్ 29, 30, డిసెంబర్ 1వ తేదీల్లో ఈ ప్రదర్శన ఉంటుందని వెల్లడించారు. క్రెడాయ్ విశాఖ చాప్టర్ ఛైర్మన్ కెఎస్‌ఆర్‌కె.రాజు (సాయి) మాట్లాడుతూ నిర్మాణ రంగంలో ఉన్న అవకాశాలన్నింటినీ ఒకే వేదికపైకి తీసుకురావడమే తమ లక్ష్యమన్నారు. సమాజ సేవలో క్రెడాయ్ ఎప్పుడూ ముందుంటుందని, విజయవాడలోని వరద బాధితుల సహాయార్థం విశాఖ చాప్టర్ తరపున రూ.10 లక్షలు, ఎపి చాప్టర్స్ తరపున రూ.50 లక్షల నిధిని సిఎం రిలీఫ్ ఫండ్‌కు అందజేశామని గుర్తు చేశారు. ఈ ప్రదర్శనలో నిర్మాణంతో పాటు మెటీరియల్ ఎక్కడ, ఎలా, ఎంతమేరకు వినియోగించుకోవాలన్నది ఇంటి యజమానులు తెలుసుకోవచ్చని, నాణ్యత ప్రామాణికాన్ని గుర్తించొచ్చని అన్నారు. క్రెడాయ్ ప్రెసిడెంట్ వి.ధర్మేందర్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో ఎకో ఫ్రెండ్లీ ఇళ్ల నిర్మాణాల గురించి తెలుసుకోవచ్చని, యజమానుల ఆర్థిక స్థితిగతుల ఆధారంగా ఏ మేరకు నిర్మాణాలు సాగించుకోవచ్చో నిపుణుల నుంచి పూర్తి వివరాలు తెలుసుకునే అవకాశం ఉంటుందని అన్నారు. ఈ మూడు రోజులు బ్యాంకులు కూడా తమ ఆఫర్లు ప్రకటిస్తుంటాయని, రుణాలు పొందే అవకాశాలకు మార్గం సుగుమం చేస్తాయని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి వి.శ్రీను మాట్లాడుతూ ఏటా మాదిరి ఈసారీ విశాఖ ప్రజల సహకారంతో పదో ప్రాపర్టీ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 80స్టాళ్లు, 100 ప్రాజెక్టులు ఇందులో కొలువుతీరుతాయని ప్రాపర్టీ షో కన్వీనర్ సిహెచ్.గోవిందరాజు తెలిపారు. ఎపి చాప్టర్ ప్రధాన కార్యదర్శి బాయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చుకునేందుకు, విశాఖలోని విశ్రాంత జీవితం హాయిగా గడుపుకొందామనుకునే వాళ్లకు ఈ ప్రదర్శన ఓ వేదిక అవుతుందన్నారు. ఎపిలో ఇటీవల అమల్లోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానం అందరికీ చేరువయ్యేలా ఉండాలన్నారు. చిన్న చిన్న లోపాల్ని కూడా సరిచేసి, అందరికీ ఇసుక అందుబాట్లో ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో ఎస్‌బిఐ డిజిఎం పంకజ్ కుమార్, సంస్థ విశాఖ చాప్టర్ ఉపాధ్యక్షులు ఇ.అశోక్ కుమార్, సంయుక్త కార్యదర్శులు కె.శ్రీనివాస్, పి.నరసింహరావు, జి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఉవ్వెత్తున 'ఉక్కు' రక్షణ నినాదం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ ఉక్కు కార్మికులు ప్లాంట్‌ను రక్షించుకునేందుకు మరింత బలమైన, ఉవ్వెత్తున ఉద్యమించడానికి ప్రతిన పూనారన్నది స్పష్టమవుతోంది. దాదాపు 1312 రోజులకు చేరుకుంటున్న ఈ కార్మికాందోళనను చూస్తే.. ఈ ఉద్యమం ప్రత్యక్ష కార్యాచరణలకు దారితీయక ముందే ప్రభుత్వం చక్కని పరిష్కారం చూపాలన్న అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది. ప్రస్తుతం రాస్తారోకోలు, ధర్నాలు, ఆందోళనలు, మహా ధర్నాలతో ఇప్పటికే ఉద్యమ రూపాన్ని మార్చారు. ఇంకా మిగిలింది తాడో పేడో కేంద్రంలోని బిజెపితో తేల్చుకోవడమే. రాష్ట్రంలోని కూటమి పార్టీల్లో బిజెపి నేతలు స్టీల్‌ప్లాంట్ సమస్యను కన్నెత్తి కూడా చూడడం లేదన్నది తెలిసిందే.

మాటలతో పూతలు పనికి రావు

అయితే, కూటమి పార్టీల్లోని టిడిపి నేతలు మాత్రం ఇంకా మూడేళ్ల కార్మికుల గాయాలకు పైపై పూతలు పూయాలని చూస్తున్నారు. ఎలాంటి ఆర్థిక ఇబ్బందులు, సంక్షోభం లేని వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను మోడీ సర్కారు 100 శాతం వ్యూహాత్మక అమ్మకం కోసం 2021 జనవరిలో తీసుకున్న విధానంతో సంక్షోభంలోకి నెట్టేసింది. దీన్నుంచి బయటపడే మార్గాలు రెండే రెండు ఉన్నాయి. ఒకటి మోడీ తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవడం లేదంటే రా మెటీరియల్ కోసం తక్షణమే రూ.3 వేల కోట్లు అప్పు ఇప్పించి, సెయిల్‌లో విలీనం చేసి, 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లతో పూర్తి సామర్థ్యంతో పనిచేయించడం చేయాలి. అంత సులభంగా ఇదంతా జరిగేదేనా ? అంటే ఇప్పటికే సిపిఎం అలుపెరగని పోరాటం చేస్తోంది. వామపక్షాలు పూర్తిగా ప్లాంట్ రక్షణకు పోరాడుతున్నాయి. ఎటొచ్చి రాష్ట్రంలోని కూటమి పార్టీల్లో ప్రధానమైన టిడిపి, జనసేన పట్టుపట్టాల్సిన పనే ఉందన్నది సర్వత్రా వినిపిస్తున్న మాట.. విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు శ్రీభరత్ స్వయంగా శనివారం కూర్మన్నపాలెం గేటు వద్ద శిబిరాన్ని సందర్శించి 'మా నమ్మకం అంతా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పైనే పెట్టుకున్నామని, స్థానిక ఎంపీ, ఎంఎల్‌ఎ స్థాయి



దాటిపోయిందంటూ కుండబద్దలు కొట్టారు. సిఎండిలు మారితే ప్లాంట్ పరిస్థితి మారిపోతుందన్న భ్రమలతో సైతం ఈ నాయకులు మాట్లాడినట్టు స్పష్టమవుతోంది. సమస్య కేంద్రంలోని బిజేపి ప్రభుత్వ ప్రధాన మంత్రి నరేంద్రమోడీ సృష్టించారు. మూడు సంవత్సరాలుగా స్టీల్‌ప్లాంట్ తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోయే నిర్ణయం ఇదే.

కార్మికులకు నాలుగు ఓదార్పు మాటలు చెబితే సరిపోతుందా?

మూడు నెలల కేంద్ర క్రితం స్టీల్ మంత్రి కుమారస్వామి స్వయంగా కార్మిక నాయకులు, కార్మికులతో ఏం చెప్పారు ? ప్రైవేటీకరణ జరగదు అంటూ ఇచ్చిన భరోసా తెలిసిందే. ఈ మాటనే పదేపదే కార్మికులకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు చెప్పడంలో కొత్తదనమేముంటుంది ? 1313 రోజులకు దాదాపు స్టీల్ పరిరక్షణ ఉద్యమం చేరుకుంటోంది. ఇన్నాళ్లుగా కార్మికులు, నిర్వాసితులు, వీరి కుటుంబ సభ్యులు వేల సంఖ్యలో కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తీవ్ర కలత చెందుతూ జీవనం సాగిస్తున్నారన్నది స్పష్టం. అనేక విధాలుగా ఆర్థిక విషయాలను కోల్పోయారు. జీతాలు సక్రమంగా అందక, వేతన ఒప్పందాలు జరగక పోరాడుతున్నారు.

అంత తేలికగా ఈ సమస్య తేలుతుందా? ఏమౌతుందన్న ఆందోళన ఈ కార్మిక కుటుంబాల్లోనే కాదు యావత్ రాష్ట్ర ప్రజల్లోనూ ఏపిలో అతిపెద్ద భారీ ప్రభుత్వ రంగ సంస్థ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలన్న కోర్కె నానాటికీ బలపడుతోంది.

ఇంకా స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం కానివ్వం, మా నిబద్ధతను ప్రధాన ప్రతిపక్షం శంకించడమా ? అంటూ భీమిలి ఎంఎల్‌ఎ గంటా మాట్లాడడం ఎంతవరకు సమంజసం? రాష్ట్ర పార్టీ నేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఈ మాట గనక చెప్పి ఉంటే కార్మికులు, ఈ ప్రాంత ప్రజలు సంతోషించేవారన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ప్లాంట్ మూతపడితే రాజీనామాలు చేసి కలసి నేను పోరాడతానంటూ స్థానిక ఎంఎల్‌ఎ పల్లా శ్రీనివాసరావు చెప్పిన మాటను కూడా కార్మికుల్లో చాలా మంది విశ్వసించడం లేదు.

స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వం : గంటా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ విషయంలో ఇప్పటికే తమ నిబద్ధత నిరూపించుకున్నామని, జగన్మోహన్ రెడ్డి చిత్తశుద్ధి ఏంటని భీమిలి ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. అధికారంలో ఉండగా వైసిపి వైఫల్యం కారణంగానే ప్రైవేటీకరణ ప్రతిపాదన ముందుకు వెళ్లిందని తెలిపారు.

ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం కానివ్వబోమని స్పష్టం చేశారు. సిరిపురం విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనా వద్ద తనను కలిసిన మీడియాతో ఈ అంశంపై ఆయన మాట్లాడారు.

పలుచోట్ల ఇంజినీరింగ్ డే వేడుకలు

ప్రజాశక్తి-యంత్రాంగం
ఇంజినీరింగ్ డే వేడుకలను శనివారం విశాఖలో పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

తగరపువలస : స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజినీరింగ్ డే వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నెట్ జీరో ఇండస్ట్రీ ఇన్నోవేషన్ సెంటర్ (ఎన్‌జెడ్ఐఐసి) తీస్ డే యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ కుమార్ మాట్లాడుతూ, ఇంజినీర్స్ డే ప్రాధాన్యతను వివరించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలని విద్యార్థులకు సూచించారు. సాంకేతిక రంగంలో అసాధారణ ప్రతిభ కనబరిచిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జీవిత విశేషాలను వివరించారు. నేటి యువ ఇంజినీర్లకు ఆయన జీవితం మార్గదర్శకం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ బి.మురళీకృష్ణ, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సురేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సీతమ్మధార : భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యను నేటి యువ ఇంజినీర్లు ఆదర్శంగా తీసుకొని పనిచేయాలని కృష్ణ యూనివర్సిటీ ఫార్మర్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎస్.రామకృష్ణారావు అన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో 57వ ఇంజినీర్స్ డే వేడుకల్లో భాగంగా ఇంజినీరింగ్ సొల్యూషన్స్ ఫర్ ఏ సస్టైనబుల్ వరల్డ్ అనే అంశంపై గెస్ట్ లెక్చర్ నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జిటి.నాయుడు మాట్లాడుతూ, పర్యావరణ సమస్యలు పరిష్కరించడానికి సివిల్ ఇంజినీరింగ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ప్రిన్సిపల్ డాక్టర్ దీపక్ చౌదరి మాట్లాడుతూ, ప్రపంచంలోనే రష్యా తర్వాత భారతదేశం ఎక్కువ మంది ఇంజినీర్లను అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ ఇంజినీరింగ్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కుమార్

కొండ చిలువ కలకలం

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి తహశీల్దారు కార్యాలయం, ఎసిబి కార్యాలయం సమీపంలో పెద్ద కొండ చిలువ శనివారం కలకలం రేపింది. రహదారి పక్కన 9వ వార్డు ఎండాడ, ఆదర్శనగర్ ప్రాంతాలకు జివిఎంసి నీటిని సరఫరా చేసే పంప్ హౌస్ ఉంది. శనివారం మధ్యాహ్నం పంప్ హౌస్ నుంచి నీటిని విడుదల చేసేందుకు సిబ్బంది నరేష్ కిందికి దిగాడు. పెద్ద కొండ చిలువ అక్కడ కనిపించడంతో ఒక్కసారి బెంబేలెత్తిపోయాడు. కొండ చిలువ సమాచారాన్ని స్నేక్ క్యాచర్ కిరణ్‌కు అందించారు. కిరణ్ అక్కడకు చేరుకొని పామును పట్టుకొని అడవిలో విడిచి పెట్టాడు. దీనితో అక్కడ ఉన్నవారంతా ఊపిరి పీల్చుకున్నారు. పామును పట్టుకున్న కిరణ్‌ను అందరూ అభినందించారు.

సెబ్ రద్దుపై పాలాభిషేకం

ప్రజాశక్తి -భీమునిపట్నం : గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటుచేసిన స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ను ప్రస్తుత కూటమి ప్రభుత్వం రద్దు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర చిత్ర పటాలకు సంబంధిత అధికారులు, సిబ్బంది పాలాభిషేకం చేశారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖను పునరేకీకరణ చేసినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ వి.రామకృష్ణ, ఎస్ఐ పి.చిన్నంనాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

హైస్కూల్ గోడ మట్టి తొలగింపు

ప్రజాశక్తి -ఆనందపురం : ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన ఆనందపురం జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ మట్టిని శనివారం తొలగించారు. ప్రహరీ కూలి మట్టి అంతా రోడ్డుపై ఉండటంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని సర్పంచ్ చందక లక్ష్మి దృష్టికి కాలనీ వాసులు తీసుకెళ్లారు. సర్పంచ్ వెంటనే స్పందించి ఒక ట్రాక్టర్‌ను పెట్టి వ్యర్థాలను తొలగించారు. దీంతో సర్పంచ్‌కు కాలనీవాసులు ధన్యవాదాలు తెలిపారు.

పోలీస్ పెట్రోలింగ్ వాహనానికి టైర్లు అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక పోలీస్ పెట్రోలింగ్ వాహనానికి మండలంలోని చిప్పాడ దివీస్ సంస్థ రూ.32,500 విలువ గల 5 టైర్లను శనివారం అందజేశారు. ఇందుకుగాను దివీస్ యాజమాన్యానికి సిఐ బొడ్డేపల్లి సుధాకర్, ఎస్ఐలు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ జి.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి -తగరపువలస : ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యాన ఏటా మాదిరిగానే చిట్టివలస జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం ఎన్ఎంఎంఎస్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను విశాఖ నగరంలోని రైల్వే ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సాయి విమల ప్రారంభించారు. ఈ సందర్భంగా చిట్టివలస జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పొట్నూరు మురళీ మోహన్‌రావు మాట్లాడుతూ, ఫ్రెండ్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అందిస్తున్న సేవలను కొనియాడారు. సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు గంటన మోహనరావు మాట్లాడుతూ, 2018లో తమ సొసైటీ ఆధ్వర్యాన ఎన్ఎంఎంఎస్ తరగతులను ప్రారంభించి మంచి ఫలితాలు రాబట్టామని వివరించారు. 8వ తరగతి విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష ఉత్తీర్ణత సాధించిన తర్వాత 9, 10, ఇంటర్ మొదటి, రెండో ఏడాది వరకు ఏటా కేంద్ర ప్రభుత్వం రూ.12 వేలు చొప్పున అందజేస్తుందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు 58 మంది విద్యార్థులు ప్రయోజనం పొందడం తమ సొసైటీకి ఎంతో గర్వకారణమని అన్నారు. సొసైటీ అధ్యక్షులు దత్తి ఈశ్వరరావు పుస్తకాల కొనుగోలుకు రూ.10 వేలు చెక్కును సొసైటీకి అందజేశారు. ఈ కార్యక్రమంలో భీమిలి డైట్ అధ్యాపకులు గొట్టేటి రవి, సొసైటీ ప్రధాన కార్యదర్శి రేఖ అప్పారావు, కోశాధికారి బి.అప్పారావు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా హెరిటేజ్ ఫెస్ట్

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం గంభీరంలో హరేకృష్ణ మూమెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ఆధ్వర్యాన హెరిటేజ్ ఫెస్ట్ -2024ను నిర్వహించారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాంస్కృతిక కళలను ప్రోత్సహించి, వాటి గొప్పతనాన్ని భావిభారత పౌరులకు తెలియజేయాల్సిన అవసరముందని ఎంపీ పేర్కొన్నారు. అంతరించిపోతున్న కలలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే కలలపై మక్కువ నేర్పించాలన్నారు. అనంతరం పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ, విద్యార్థుల్లోని నైపుణ్యాలను వెలికి తీయడానికి హరేకృష్ణ మూమెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రతినిధులు చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. హరేకృష్ణ మూమెంట్, అక్షయపాత్ర ఫౌండేషన్ ప్రెసిడెంట్ భక్త దాస మాట్లాడుతూ, శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా గత నెల 16 నుంచి 24వ తేదీ వరకు చిత్రలేఖనం, భగవద్గీత శ్లోక పఠనం, పౌరాణిక వేషధారణ, గాత్ర సంగీతం పోటీలు నిర్వహించామని, 49 పాఠశాలల నుంచి 1980 మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, మెమోంటులు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జి, వాగ్దేవి విద్యా మందిర్ కరస్పాండెంట్ రాధాకృష్ణ, శ్రీ వెంకట్ విద్యాపీట్ కరస్పాండెంట్ రొంగలి వెంకటేశ్వరరావు, నాయకులు బిఆర్‌బి నాయుడు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీ శ్రీభరత్

శ్రీకాంత్‌నగర్‌లో రహదారి సూచిక బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి - ఆరిలోవ : జివిఎంసి 13వ వార్డు పరిధి శ్రీకాంత్‌నగర్ లే-అవుట్‌లో వీధి రోడ్డు సూచిక బోర్డులను శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు కుమారుడు ప్రతాప్ రుద్ర పాల్గొని సూచిక బోర్డులను ప్రారంభించారు. అక్కడ నుంచి ఆయన కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని సందర్శించారు. అనంతరం గణపతి మహోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో పాల్గొని ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్ష, కార్యదర్శులు పాత్రకండ ధర్మారావు, యల్లమిల్లి సురేష్, మహిళా అధ్యక్షులు మజ్జి రమణి, నల్లాని వరలక్ష్మి, నీలి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - ఆరిలోవ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన శనివారం జాతీయరహదారి జూ పార్కు వద్ద చోటు చేసుకుంది. దీనికి సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... కొమ్మాది, కార్పెంటర్స్ కాలనీకి చెందిన కిల్లి చంద్రశేఖర్ (22) శనివారం తెల్లవారు జామున 4 గంటలకు కొమ్మాది నుంచి వాల్తేరు డిపోకు తన తండ్రి కిల్లి అన్నంనాయుడుకు బైక్‌పై తీసుకొని వెళ్లాడు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో జూ పార్కు సమీపంలో పండ్లు అమ్మే స్టాల్స్ వద్ద ఉదయం 5 గంటలకు బైకు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి కింద పడిపోయి గాయాలపాలయ్యాడు. స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. తీవ్ర గాయాలైన చంద్రశేఖర్ అప్పటికే మృతి చెందినట్టు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. ఆరిలోవ ఎస్ఐ శేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

గంజాయి కేసులో ఒకరు అరెస్ట్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫామ్‌పై విశాఖపట్నం జిఆర్‌పి ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనంజయనాయుడు ఆధ్వర్యాన ఆర్‌పిఎస్ఐ వి.రవివర్మ సిబ్బంది తనిఖీలు చేపట్టారు. విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో గంజాయి అక్రమంగా రవాణా చేయడానికి రెక్కీ నిర్వహిస్తున్న అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన సదేరి సత్తిబాబును అదుపులోకి తీసుకున్నారు. సత్తిబాబును సబ్-ఇన్‌స్పెక్టర్ వి.రవివర్మ అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. మాదకద్రవ్యాల స్మగ్లింగ్ ముఠాలను పట్టుకోవడానికి రైల్వే పోలీస్, ఆర్‌పిఎఫ్ ప్రత్యేక టీమ్‌ల సహాయంతో నిఘా వర్గాలను ఏర్పాటుచేసి, విశాఖపట్నం, దువ్వాడ, అనకాపల్లి, సింహాచలం రైల్వేస్టేషన్ పరిధిలో తనిఖీలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి

ప్రజాశక్తి-నక్కపల్లి: మండలంలోని డొంకాడ గ్రామానికి చెందిన రైతు సఖిరెడ్డి శివ(30) పాముకాటుతో మృతి చెందినట్లు హెచ్‌సి వెంకటరావు తెలిపారు. శుక్రవారం శివ పొలంకు వెళ్ళినప్పుడు పాము కాటు వేసింది. దీంతో ఆయన ఇంటికి వస్తూ మార్గ మధ్యలో అపస్మారక స్థితికి చేరి పడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెంటనే శివను తుని ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ తరలించారు. పరిస్థితి విషమించడంతో శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు వెంకట్రావు తెలిపారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

అటెండర్ వెంకట్రావు మృతి

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక తహశీల్దార్ ఆఫీసులో పనిచేస్తున్న అటెండర్ వెంకట్రావు శనివారం కాలువలో పడి మృతి చెందారు. ప్రతిరోజూ మాదిరిగా శనివారం ఉదయం వాకింగ్ చేస్తూ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న కాలువలో జారి పడిపోయాడు. తలకు గాయం కావడంతో మృతి చెందాడు. గాజువాక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం

జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి

ప్రజాశక్తి -ఆనందపురం: ప్రకృతి వ్యవసాయ పంటలతో ఆరోగ్యం చేకూరుతుందని జిల్లా వ్యవసాయాధికారి అప్పలస్వామి పేర్కొన్నారు. మండలంలోని బోని రైతు సేవా కేంద్రాలను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సేంద్రీయ పద్ధతుల ద్వారా వ్యవసాయాన్ని చేపడితే రసాయనాల వాడకాన్ని తగ్గించడానికి అవకాశం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా కషాయాలను తయారుచేసి పంటలకు వేస్తే చీడపురుగులు నివారించవచ్చన్నారు. ఈ సందర్భంగా రైతు సేవా కేంద్రంలో ఆరు రకాల కషాయాలను ఏ విధంగా తయారు చేయాలో రైతులకు వివరిస్తూ తయారుచేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ మోహనరావు, రీజనల్ అధికారులు ప్రకాష్, హేమసుందర్, విఎఎ దిలీప్, బోని గ్రామ సర్పంచ్ సురాల సత్యవరప్రసాద్, బాలామణి, యూనిట్ ఇన్చార్జ్ పైడితల్లి, పొట్నూరు యూనిట్ ఐసిఆర్‌పిలు, రైతులు పాల్గొన్నారు.


కషాయాల తయారీని వివరిస్తున్న వ్యవసాయాధికారులు

అక్టోబర్ 19, 20 తేదీల్లో ఐసిఇయు మహాసభలు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : విశాఖ నగరంలో వచ్చేనెల 19, 20 తేదీలలో ఐసిఈయు గోల్డెన్ జూబ్లీ మహాసభలు పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ (ఐసిఈయు) విశాఖపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాదరావు తెలిపారు. గోల్డెన్ జూబ్లీ కాన్ఫరెన్స్ నిర్వహణ కమిటీ సమావేశం శనివారం స్థానిక ఎల్ఐసి డివిజనల్ కార్యాలయం స్పోర్ట్స్ క్లబ్ లో జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 1974 అక్టోబర్ 18న ఏర్పాటైన ఐసిఇయు విశాఖపట్నం డివిజన్, ఎల్ఐసి ఉద్యోగుల డిమాండ్ల సాధనలో, ప్రభుత్వ రంగంలో ఎల్ఐసి పరిరక్షణలోకార్మిక వర్గ పోరాటాల సాధనలో కీలకపాత్ర పోషించిందన్నారు. సభ్యులకు ట్రేడ్ యూనియన్ విద్య, ఏజెంట్ల మధ్య కొత్త వ్యాపార పోటీ, క్లెయిమ్‌ల క్లియరెన్స్, బడ్జెట్ 2024 వంటి విభిన్న సమకాలీన అంశాలపై అనేక సదస్సులు, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఐఆర్‌డిఎ ప్రతిపాదనలు మొదలైన అనేక కార్యకలాపాలతో గోల్డెన్ జూబ్లీ సంవత్సరం జరుపుకున్నాంని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా పేద పిల్లలకు పుస్తకాల పంపిణీ, గిరిజన హాస్టళ్లలో వైద్య శిబిరం వంటి అనేక కార్యక్రమాలు నిర్వహించినట్లు గుర్తుచేశారు.

స్వర్ణోత్సవ సంవత్సరం ముగింపు సందర్భంగా ఈ మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వేడుకల కార్యక్రమానికి చైర్‌పర్సన్‌గా ఎన్.కృష్ణమూర్తి, కన్వీనర్‌గా జి.వరప్రసాద్‌తో రిసెప్షన్ కమిటీని ఏర్పాటుచేశారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సోదర సంఘాలు, సోదర సంఘాల నాయకులు కె.మోహనరావు, (ఐసిఆర్ఇఎ), గణపతి, రాము (ఎల్ఐసి ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంఘం, ఎల్ఐసి ఒబిసి సంఘం) బి.శ్రీనివాసరావు, (ఎల్ఐఎఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి) తిరుమలరావు, రవీంద్రనాథ్ ఠాగూర్, జిఎల్‌ప్రసన్న, ఐసిఇయు అన్ని యూనిట్ల నాయకులు పాల్గొన్నారు. స్వర్ణోత్సవ సదస్సు పోస్టర్‌ను విడుదల చేశారు.

ఇద్దరు హాస్టల్ ఉద్యోగుల సస్పెన్షన్

ప్రజాశక్తి-సీతమ్మధార : సీతమ్మధారలోని సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్ - 2లో ఇద్దరు ఉద్యోగులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ సస్పెండ్ చేశారు. హాస్టల్ సంక్షేమ అధికారి ఆర్.ప్రసాదరావును సస్పెండ్ చేశారు. కాంట్రాక్ట్ ఉద్యోగి ఎం.అప్పారావును విధుల నుంచి తొలగించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సీతమ్మధార సాంఘిక సంక్షేమ శాఖ బాయ్స్ హాస్టల్ - 2లోని మరుగుదొడ్లను శుభ్రపరిచేందుకు అక్కడ విద్యార్థులను వినియోగించినట్లు ఈ నెల 9వ తేదీన ఫిర్యాదు రావడంతో విచారణ జరపగా నిజమని నిర్ధారణ కావడంతో ఆ ఇద్దరు ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ వివరించారు.

సీతారాం ఏచూరి జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

ప్రజాశక్తి-మాధవధార : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి విద్యార్థి నేతగా ఉంటూ విద్యా వ్యవస్థలో సామాజిక మార్పునకు ఎనలేని కృషి చేశారని, ఆయన జీవితాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ, ఒబిసి డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు డిమాండ్‌చేశారు. నిరుపేదలకు, అణచివేతకు గురైన సామాజిక తరగతులకు కూడా ఉన్నత విద్యా అవకాశాలు హక్కుగా సిద్ధించాలని పరితపించి ఆ దిశగా పోరాడిన నవతారం నేత ఏచూరి అని కొనియాడారు. ఆయన సోషలిస్ట్ ప్రపంచం కోసం కలలుగన్నారని, జీవితాంతం అందుకోసమే పని చేసి మేధావులకు, రాజకీయ నాయకులకు, ఆస్తికులకు, నాస్తికులకు కూడా గొప్ప స్ఫూర్తిగా నిలిచారని పేర్కొన్నారు. 'పుట్టుక మాత్రమే మాది - మా శరీరంతో సహా జీవితమంతా ప్రజలదే' అనే మనిషి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా పేరు తెచ్చుకున్నారని తెలిపారు. ఢిల్లీ నుంచి వెలువడుతున్న హిందుస్థాన్ టైమ్స్‌కు లెఫ్ట్ హ్యాండ్ డ్రైవ్ పేరుతో చాలా వ్యాసాలు రాశారని గుర్తుచేశారు.

దుర్గాప్రసాద్‌కు సేవా రత్న అవార్డు

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖ నగరానికి చెందిన సీనియర్ జర్నలిస్టు దుర్గాప్రసాద్‌కు భారత సేవారత్నం పేరిట సోమలరాజు ఫౌండేషన్ ప్రకటించిన అవార్డును బెంగళూరులోని జక్కూరులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సముదాయ భవన్‌లో శనివారం నిర్వహించిన ఆ సంస్థ 12వ వార్షికోత్సవ వేడుకల్లో అందజేశారు. వివిధ రంగాల్లో నిష్ణాతులు, సమాజ సేవకుల్ని జాతీయ స్థాయి అవార్డులతో అతిథులచే సత్కరించినట్టు ఫౌండేషన్ వ్యవస్థాపకులు శివరాజు తెలిపారు. విశాఖలోని విక్టరీ మీడియా రీజినల్ కో-ఆర్డినేటర్‌గా పనిచేస్తున్న దుర్గాప్రసాద్‌కు 'భారత సేవా రత్న' అవార్డును అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఓ జర్నలిస్టుగా ఈ సమాజానికి చేస్తున్న సేవతోపాటు, తన సామాజిక సేవా కార్యక్రమాల్ని గుర్తించి అవార్డుతో సత్కరించిన సోమరాజు ఫౌండేషన్ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆదాయం గణం.. అభివృద్ధి శూన్యం

అధ్వానంగా వేములవలస పంచాయతీ

ప్రజాశక్తి-ఆనందపురం : ఉత్తరాంధ్రలోనే ఆనందపురం మండలంలోని వేములవలస పూల మార్కెట్ ఆశీలు ఏడాదికి రూ.కోటిన్నరకు పైగా ఆదాయం వస్తుంది. పూల మార్కెట్, కూరగాయల మార్కెట్ ఇక్కడ ఉండటంతో ఈ పంచాయతీకి ఆదాయం ఎక్కువగానే ఉంటుంది. అయితే పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా పరిస్థితులు కనబడుతున్నాయి. చిన్నపాటి వర్షం పడినా వ్యర్థాలు ఇక్కడకు కొట్టుకు రావడంతో దుర్వాసన వెదజల్లుతోంది. ఇటీవల పడిన భారీ వర్షాలకు పూల మార్కెట్ నుంచి వేములవలసకు వెళ్లే రహదారి అధ్వానంగా మారింది. ఒక పక్క నీటి ప్రవాహానికి రోడ్లు కోతకు గురికాగా, మరోపక్క స్టేట్ బ్యాంకు వద్ద పేరుకుపోయిన చెత్తతో స్థానిక వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అసలే లోతట్టు ప్రాంతం కావడం వల్ల మురుగునీరు గుంతల్లోకి చేరి ఈగలు దోమలు వృద్ధి చెందుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేములవలస పంచాయతీ పరిధిలో బ్యాంక్ ఆఫ్ బరోడా ఎదురుగా నివాసాల మధ్య వ్యర్థాలు, పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దోమలు, ఈగలు వృద్ధి చెంది రాత్రి వేళలో గ్రామస్తులకు కంటిమీద కునికి లేకుండా చేస్తున్నాయి. గ్రామాల్లో కాలువలు లేకపోవడంతో వర్షపు నీటితో పాటు మురుగు నీరు కూడా పరిసరాల్లో చేరడంతో ఇబ్బందులకు గురవుతున్నారు. జన సమూహాలు ఉండే ప్రాంతాలలో పిచ్చి మొక్కలు, మురుగు నీరు ఉండటం వల్ల వ్యాధులు ప్రబలే ప్రమాదముందని, పంచాయతీ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, బ్యాంకు సిబ్బంది కోరుతున్నారు.

ప్రథమ చికిత్సపై అవగాహన



ప్రథమ చికిత్సపై అవగాహన కల్పిస్తున్న అతిథులు

ప్రజాశక్తి- కలెక్టరేట్ : వరల్డ్ ఫస్ట్ ఎయిడ్ డేను పురస్కరించుకొని విశాఖపట్నం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యాన చైర్మన్ డాక్టర్ వై.శివనాగేంద్రరెడ్డి సూచనల మేరకు విఎస్.కృష్ణ డిగ్రీ కాలేజీ, పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాలలో ప్రథమ చికిత్సపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం రెడ్ క్రాస్ సెక్రటరీ పి.రవికుమార్ మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ రెడ్ క్రాస్, రెడ్ క్రాస్ సొసైటీలు 2000 సంవత్సరం నుంచి ఏటా సెప్టెంబర్ రెండవ శనివారం ప్రథమ చికిత్స పాత్ర గురించి ప్రజలలో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించాయని వివరించారు. తీవ్ర ప్రమాదం జరిగినప్పుడు గోల్డెన్ పిరియడ్‌గా పరిగణించే మొదటి 10 నిమిషాలు ప్రాణాన్ని రక్షించుటకు ఉపయోగించే మెళకువలు ప్రథమ చికిత్స శిక్షణలో రెడ్ క్రాస్ ద్వారా నేర్పిస్తామని తెలిపారు. రెడ్ క్రాస్ మేనేజింగ్ కమిటీ మెంబర్, ఫస్ట్ ఎయిడ్ ట్రైనర్ ఎమ్‌డి రెహమతుల్లా మాట్లాడుతూ, ప్రథమ చికిత్స శిక్షణలో భాగంగా ప్రమాదం జరిగినప్పుడు రక్తస్రావాన్ని తగ్గించుటకు, ఎముకలు విరిగినప్పుడు నొప్పి నుంచి ఉపశమనం పొందుటకు కట్లు కట్టడం, గుండెపోటు, కరెంట్ షాక్, నీటిలో మునిగిపోవడం వంటి ప్రమాదాలు జరిగి స్పృహ కోల్పోయి శ్వాస లేదా గుండె ఆగిపోయినప్పుడు కార్డియో పల్మోనరీ రిసిటేషన్ (సిపిఆర్) చేసి ప్రాణాలు రక్షించడం, పాముకాటు, వడదెబ్బ, విషప్రయోగం ద్వారా షాక్ కు గురైనప్పుడు రక్షించే పద్ధతులు, సాధారణ వస్తువులతో స్ట్రెక్చర్స్ తయారుచేయడం, ప్రమాద సమయంలో బాధితున్ని ఎత్తుకునే పొజిషన్స్ వంటి అనేక విషయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ పిఆర్ఒ ఎస్‌కెఎల్.రావు, కౌన్సిలర్ పాగోటి రాంబాబు, విఎస్.కృష్ణ కాలేజీ ప్రిన్సిపల్ విజయబాబు, వైస్ ప్రిన్సిపల్, సహచర సిబ్బంది, ఆదర్శ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ థియోఫిలస్, సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందిస్తున్న భాస్కర్

హాస్టల్ విద్యార్థులకు క్రీడా సామగ్రి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక ప్రభుత్వ డైట్ సమీపంలో ఉన్న 160 మంది బిసి హాస్టల్ విద్యార్థులకు అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ అధ్యక్షులు నిమ్మకాయల భాస్కర్ తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం క్రీడా సామగ్రితో పాటు స్టేషనరీని అందజేశారు. క్యారమ్ బోర్డులు, వాలీబాల్, ఫుట్‌బాల్, నెట్ తదితర క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఇందుకు గాను హాస్టల్ వార్డెన్ సన్యాసిరావు, భాస్కర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఆఫ్ పీపుల్ పవర్ సభ్యులు శివ, గోపీనాథ్, రాజు, లక్ష్మణస్వామి, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా యోగా పోటీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్‌కు అనుకుని ఉన్న క్రీడా మైదానంలో శనివారం 49వ ఎపి యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ -2024 రాష్ట్ర స్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన చిప్పాడ దివీస్ సంస్థ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్ మాట్లాడుతూ, యోగా ద్వారా పరిపూర్ణమైన ఆరోగ్యం సమకూరుతుందన్నారు. క్రీడా పతాకాన్ని యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్‌ఎఆర్‌కె.వర్మ అవిష్కరించారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఆతిథ్యమిచ్చిన సన్ స్కూల్ విద్యా సంస్థ అధినేత కె.శ్రీనివాసరావును నిర్వాహకులు అభినందించారు. అసోసియేషన్ కార్యదర్శి ఎం అవినాష్, విశాఖ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రవి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రామారావు, ఉపాధ్యక్షులు డాక్టర్ జెడి.చక్రవర్తి, కోశాధికారి డాక్టర్ రాపర్తి శ్రీను, సహాయ కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, టిడిపి నాయకులు గంటా నూకరాజు, గాడు అప్పలనాయుడు, వై.అనీల్‌ప్రసాద్, ఎస్.జోగారావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోని 25 జిల్లాల నుంచి సుమారు 8ఏళ్ల నుంచి 60 ఏళ్లలోపు ఉన్న 600 మంది యోగా పోటీలకు హాజరయ్యారు. ఒక్కో జిల్లా నుంచి పురుషులు 11 గ్రూపులు, మహిళలు 11 గ్రూపుల వారీగా యోగా పోటీలు జరిగాయి. రెండ్రోజుల పాటు ఈ పోటీలు జరగనున్నాయి.

గ్రూపు హౌస్ కోసం స్తంభాలు మార్చొద్దని వినతి

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 94వ వార్డు పరిధి కృష్ణానగర్ మూడు గుళ్ల వీధిలో నూతనంగా నిర్మించిన గ్రూపు హౌస్‌కు విద్యుత్ కనెక్షన్ కోసం బిల్డర్ దరఖాస్తు చేయగా విద్యుత్ అధికారులు తక్షణమే ఏర్పాట్లు చేశారని, దాని కోసం స్తంభాలను మార్చితే వీధిలో పెద్ద వాహనాలు తిరిగే అవకాశముండదని స్థానికులు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు మొత్తం 10 అడుగులు ఉందని, ఇప్పుడు కొత్తగా వేస్తున్న స్తంభాలు సుమారు అడుగున్నరకు పైగా ఉన్నాయని, అటు, ఇటు కాలువలకు పోతే రోడ్డు చిన్నది అయిపోతుందని వివరించారు. అత్యవసర సమయాల్లో అగ్నిమాపక శకటంకానీ, అంబులెన్స్ కానీ రాలేని పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తంచేశారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి విద్యుత్ శాఖ ఎఇ రమణమూర్తితో మాట్లాడారు. వీధిలో కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటువల్ల ప్రజలకు ఇబ్బంది కలుగుతుందని, అండర్ గ్రౌండ్ కేబుల్ ఏర్పాటుకు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఈ విధమైన ప్రతిపాదనలు తెస్తే జివిఎంసి, విద్యుత్ అధికారులతో చర్చలు జరుపుతానని చెప్పారు. ఈ మేరకు ప్రణాళికలు తయారుచేసి తనకు పంపించాలని జోనల్ కమిషనర్ హైమావతిని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా అధికారులతో మాట్లాడినందుకు ఎమ్మెల్యేకు స్థానికులు యర్రా నాగరాజు ఆధ్వర్యాన ధన్యావాదాలు తెలిపారు.

దసరా ఉత్సవ్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన గంటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఉన్నతాశయంతో మహిళలు నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. విఎంఆర్‌డిఎ చిల్డ్రన్స్ ఎరీనాలో మహావీర్ విశాఖపట్నం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దసరా ఉత్సవ్ ఎగ్జిబిషన్ ను శనివారం ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మహిళా సాధికారతతో దేశం ముందడుగు వేస్తుందని చెప్పారు. అనంతరం సంస్థ ఆంధ్రప్రదేశ్ , ఒడిశా చైర్మన్ సుభోద్ రెకేచ మాట్లాడుతూ, ఈ ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ప్రియదర్శిని ఓల్టేజ్ హోం పునర్నిర్మాణానికి ఇవ్వాలని ఆలోచన చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. 260 మంది మహిళలు సభ్యులుగా ఉన్న ట్రస్ట్ ప్రతి ఏడాది నిర్వహించే ఎగ్జిబిషన్ ద్వారా వచ్చే ఆదాయాన్ని దాతృత్వ కార్యక్రమాలకు వినియోగించడం ప్రశంసనీయమన్నారు. మహిళలు తయారు చేసిన 60కి పైగా వస్తువులు, హ్యాండ్‌లూం, ఫాన్సీ ఆభరణాలు, ఆహార ఉత్పత్తులకు చెందిన స్టాల్స్‌ను ఏర్పాటు చేసామని, రెండు రోజుల పాటు నిర్వహిస్తున్న ఈ ఎగ్జిబిషన్ ఉదయం 10 నుంచి రాత్రి 8.30గంటల వరకు ఉంటుందని, ప్రవేశం ఉచితం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్ పర్సన్ సునీత రెకేచ, కార్యదర్శి దివ్య లల్వాని, ఫ్యాన్సీ జైన్, నిర్మల హిరావత్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై ధ్వజమెత్తిన నాబ్ నిర్వాసితులు

● మెరుపు ఆందోళనతో దిగొచ్చిన ఆర్‌డిఒ, ఇతర అధికారులు ● సమస్యల పరిష్కారానికి స్పష్టమైన హామీ



ఆర్‌డిఒ, ఇతర అధికారులకు సమస్యలను విన్నవిస్తున్న నిర్వాసితులు

ప్రజాశక్తి -రాంబిల్లి : నేవీ ప్రహరీ గోడ వల్ల జరుగుతున్న నష్టం నుంచి తమకు విముక్తి కల్పించి, న్యాయం చేయాలని వై.లోవ గ్రామంలో గ్రామస్తులందరూ శనివారం తెల్లవారి ఐదు గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సిపిఎం మండల కన్వీనర్ జి.దేవుడు నాయుడు, పెదకాలవలపల్లి మాజీ ఎంపిటిసి రావి దేవుళ్ళు మద్దతు తెలిపి మాట్లాడారు.

బాధితుల న్యాయమైన సమస్యలు పరిష్కరించవలసిన బాధ్యత జిల్లా అధికారులపైన, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఆందోళన శిబిరం వద్దకు స్థానిక తహసీల్దార్ భాగ్యవతి, అనకాపల్లి ఆర్‌డిఒ చిన్నికృష్ణ వచ్చి ఆందోళనకారులతో మాట్లాడారు. నిర్వాసితులంతా తమ గ్రామంలో 400 కుటుంబాలకు జీవనోపాధి కల్పించాలని, గ్రామం చుట్టూ ప్రహరీ గోడ ఇంటికి పది అడుగుల నుంచి 15 అడుగులు వదిలి దూరంలో కట్టుకోవాలని, తమ గ్రామానికి శ్మశాన వాటిక 50 సెంటు ్లకొండ ప్రాంతంలో ఇవ్వాలని, గ్రామానికి వెళ్లే రహదారి మొత్తం పది అడుగులు వదిలి కట్టుకోవాలని, జిరాయితీ భూముల్లో ఉన్న కొబ్బరి జీడి తోటలకు 100 ఎకరాలకు దారి పది అడుగులు రహదారి సౌకర్యం కల్పించాలని, వరద ముంపునకు గురైన సమయంలో పునరావాసం కోసం భవన సౌకర్యం కల్పించాలని, వరదల సమయంలో స్కూల్ బిల్డింగ్ ముంపునకు గురౌతున్న నేపథ్యంలో ఎత్తైన ప్రాంతంలో పాఠశాల భవనం కట్టించి ఇవ్వాలని కోరారు. దీనిపై ఆర్‌డిఒ చిన్నికృష్ణ స్పందిస్తూ, తమ పరిధిలో ఉన్న వాటిని వెంటనే పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటామని, తమకు కొంత సమయం ఇవ్వాలని కోరారు అధికారుల మాటలను నమ్మి గ్రామస్తులు ఆందోళన విరమించారు. డిఎస్‌పి సత్యనారాయణ ఆధ్వర్యంలో రాంబిల్లి సిఐ సిహెచ్ నర్సింగరావు, స్థానిక ఎస్సై ఇతర పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైలోవ గ్రామ సర్పంచ్ బద్రి నారాయణరావు, ఎక్స్ సర్పంచ్ బద్ది నారాయణరావు, సిఐటియు జిల్లా నాయకులు కే సోమ నాయుడు, మత్స్యకార సంఘం నాయకులు ఎం రమణ, వై రాము పాల్గొన్నారు.

సన్యాసిరావు మరణం

కళా, కార్మిక రంగాలకు తీరనిలోటు

సిపిఎం, సిఐటియు సంతాపం, ఘననివాళి

ప్రజాశక్తి -అనకాపల్లి: ప్రజానాట్యమండలి నాయకులు, ప్రజా గాయకులు గంగిరెడ్డి సన్యాసిరావు మృతికి సిఐటియు అనకాపల్లి జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని ప్రకటించింది. వృద్ధాప్యంతో శనివారం గాజువాక లోని ఆయన స్వగృహంలో సన్యాసిరావు మృతి చెందారు. ఈ మేరకు సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ శంకరరావు, జి కోటేశ్వరరావు కోశాధికారి వీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ సన్యాసిరావు ప్రజానాట్యమండలి కళాకారులుగా , రచయితగా కార్మిక వర్గానికి ఎన్నో పాటలను రచించి, పాడి కార్మిక వర్గానికి అండగా నిలిచారన్నారు. ఆయన అకాల మరణం కళా రంగానికి కార్మిక లోకానికి తీరనిలోటన్నారు. వృద్ధాప్యంలో సైతం, కళ్ళు సరిగా కనిపించని పరిస్థితులను కూడా ఎదిరించి తోటి వారి సహాయంతో ఎంత సుధీర ప్రాంతాలకైనా వెళ్లడంతో పాటు తన గళాన్ని అందరికీ వినిపించే వారని అన్నారు. ఆయన మరణానంతరం పార్థివదేహాన్ని ఆంధ్ర మెడికల్ కాలేజీకి పరిశోధనలకు అందజేయడం ఆయన ఔన్నత్యానికి నిదర్శనమన్నారు.

అలాగే ప్రజానాట్య మండలి నాయకులు, ప్రజా గాయకులు జి.సన్యాసిరావు మృతికి సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపింది.ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు, కళలలకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేసింది.

చినరామ సిద్ధి వినాయకుని వార్షికోత్సవం



గణపతి వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రామకృష్ణ

ప్రజాశక్తి -అనకాపల్లి : చినరామ సిద్ధి వినాయక సేవాసంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రుల 30వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా ఈనెల 28 వరకు నిర్వహించే ఆధ్యాత్మిక వినాయకుని ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పెంటకోట చంద్రరావు అన్నారు. ఈ సందర్భంగా చినరామస్వామి కోవెల సెంటర్లో అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని తిమ్మాపాత్రుని చక్రవర్తి పర్యవేక్షణలో భక్తిగీతాలు, కోలాటం ప్రదర్శించారు. స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, తెలుగుదేశం పార్టీ విశాఖజిల్లా అర్బన్ ఉపాధ్యక్షులు, 80వ వార్డు అధ్యక్షులు బొడ్డేడ జోగినాయుడు పాల్గొని కమిటీని అభినందించారు. అనంతరంఎమ్మెల్యే కొణతాల రామకృష్ణను బొడ్డేడ జోగినాయుడులను కమిటీ సభ్యులు శాలువా వేసి సత్కరించారు.

ఈ సందర్భంగా కొణతాల రామకష్ణ మాట్లాడుతూ పిల్లలు పూర్తిగా పాశ్యాత్య సంగీతం మోజులో గడుపుతున్న రోజుల్లో తిమ్మాపాత్రుని చక్రవర్తి అన్నమాచార్య వాగ్గేయ వరదాయిని బృందంతో ప్రదర్శన, ఎంతోమంది మహిళలతో మన సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించేలా కోలాటం నృత్య ప్రదర్శన చేయడం చాలా అభినందనీయమన్నారు. అనంతరం చక్రవర్తి బృందానికి శ్రీ చినరామ సిద్ధి వినాయక ముఖ్య ప్రోత్సాహకుడు రాంబాబుకు రామకృష్ణ సత్కరించారు. జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి జనసేన 80వ వార్డు అధ్యక్షులు మళ్ళ శ్రీనివాసరావు జనసేన నాయకులు దూలం గోపి చినరామ స్వామి ఆలయ ధర్మకర్త విల్లూరి మహాలక్ష్మి నాయుడు శాలువ వేసి సత్కరించారు కార్యక్రమంలో కాండ్రేగుల బుజ్జి, పీలా కాశీ, భీమరశెట్టి రాముడు, చినరామ సిద్ధి నూకాంబిక సిండికేట్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక రద్దు

ప్రజాశక్తి- అనకాపల్లి : ప్రతి సోమవారం అనకాపల్లి కలెక్టరేట్ లో నిర్వహించే 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం) (పిజిఆర్ఎస్) కార్యక్రమాన్ని ఈనెల 16న ప్రభుత్వ సెలవు రోజు దృష్ట్యా రద్దు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఒక ప్రకటనలో తెలిపారు. మిలాద్ అన్ నబీ ప్రభుత్వ సెలవు రోజు కారణంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక'రద్దు చేయడం జరిగిందని, ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

విజయవాడ వరద బాధితులకు సాయం



ఎమ్మెల్యే రాజుకు చెక్కును అందిస్తున్న బ్రాహ్మణ సంఘం సభ్యులు

ప్రజాశక్తి -చోడవరం : విజయవాడ వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయనిధికి చోడవరం శ్రీగణేశ గాయిత్రి బ్రాహ్మణ సేవా ట్రస్ట్ తరపున రూ. 42,502 ఆర్థికసాయం చెక్కును శనివారం పిఎస్.పేట లక్ష్మి గణపతి దేవస్థానంలో స్థానిక ఎమ్మెల్యే పివిఎస్ఎన్.రాజుకు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రెసిడెంట్ పుట్రేవు శ్యామ్ ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్ ఉపాధ్యాయుల శ్రీనివాసరావు, సెక్రటరీ వింజమూరి శంకర్, ట్రెజరర్ కందర్ప సత్యనారాయణమూర్తి, సభ్యులు వారణాసి రామలింగ శాస్త్రి, కందర్ప భాస్కరరావు, గోటేటి సీతారామయ్య, రాంబాబు, కొత్తపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెట్టినాడ్ సిమెంట్స్ రూ.కోటి సాయం

కశింకోట : విజయవాడ వరద బాధితుల సహాయార్ధం కశింకోట మండలం ఎస్.పేటలోని చెట్టినాడ్ సిమెంట్ యాజమాన్యం తమ వంతు సాయంగా సీఎం సహాయనిధికి రూ.కోటి ఆర్థికసాయం చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సంస్థ సిఎండి డాక్టర్ ముత్తయ్య రామస్వామి అందించడం జరిగిందని అసంస్థ ప్రతినిధులు ప్లాంట్ హెడ్ ప్రసాద్ బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ నరసింహరాజు శనివారం తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు
చెక్కును అందజేస్తున్న సంస్థ సిఎండి రామస్వామి

పట్టణ ప్రజలకు పరిశుభ్ర నీటిని అందించండి



మాట్లాడుతున్న మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పైడారావు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పట్టణ ప్రజలకు శుద్ధి చేసిన పరిశుభ్రమైన మంచినీరు అందించాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక నాయకులు కోరారు. శనివారం స్థానిక సంఘ కార్యాలయంలో మాట్లాడుతూకొద్ది సంవత్సరాల నుంచి ఫిల్టర్ వాటర్ ప్రజలకు అందించేందుకు రూ.30 కోట్ల నిధులు వెచ్చించి అగనంపూడి నుంచి ఫిల్టర్ వాటర్ సప్లై చేస్తామంటూ కాలయాపన చేస్తు పట్టణ ప్రజలను ఊరిస్తున్నారే తప్ప ప్రజలకు పరిశుద్ధమైన నీరు అందించేందుకు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వెంటనే అగనంపూడి నుంచి ఫిల్టర్ వాటర్ సప్లైను పట్టణ ప్రజలకు అందించేందుకు కృషి చేయాలని, ఉదయం రెండు గంటలు సాయంత్రం రెండు గంటలు మంచినీరు కుళాయిలు ద్వారా అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. మంచినీటి కొరత అధికంగా ఉన్నందున గుండాల జంక్షన్, సంత బయలు జంక్షన్ ,కొప్పాక జంక్షన్ లలో అదనపు రిజర్వాయర్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని, అనకాపల్లి శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులకు విజ్ఞప్తి చేస్తున్నామని ప్రజాసంఘాల ఐక్యవేదిక నేతలు తెలిపారు. ప్రజా సంఘాల నేతలు బీసీ ఫెడరేషన్ చైర్మన్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ విల్లూరి పైడరావు, ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు డాక్టర్ చిన్ని యాదవ్,అంబేద్కర్ సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్ బండి అప్పారావు, ఆర్యవైశ్యుల సంఘం నాయకులు బొడ్డు సోమరాజు, నటభూషణ శోభన్ బాబు సేవాసమితి చైర్మన్ ముగడా అప్పారావు,మత్స్యకారుల సంఘం నాయకులు వాసుపల్లి తాతయ్యలు, బ్రాహ్మణ సంఘం నాయకులు సాయిబాబా పాల్గొన్నారు.

ఎఎంఎఎల్ కాలేజీ విద్యార్థులకు ఉద్యోగాలు



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ జయ బాబు

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక ఏఎంఏఎల్ కళాశాల నుండి ఎనిమిది మంది డిగ్రీ విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు పొందాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయబాబు తెలిపారు. కళాశాలలో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. తిరుపతిలోని శ్రీజ డెయిరీలో రూ.27వేల నెల జీతముతో పనిచేయుటకు

ఫీల్డ్ సూపర్ వైజర్లుగా ఎంపికయ్యారన్నారు. ఎనిమిది మందిలోనూ కిరణ్ సాయి, మారుతి ప్రసాద్, శివరాజు డైరీయింగ్ మరియు అనిమల్ హస్బండ్రీ నుండి, ధనుంజయ రావు, భాస్కరరావు, మురళీకృష్ణ, తేజ అగ్రికల్చర్ నుండి, దామోదర్ కెమిస్ట్రీ నుండి ఎంపిక అయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ మంగరాజు, కరస్పాండెంట్ శ్రీనివాసరావు, గవర్నమెంట్ బాడీ సభ్యులు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ నిరంజన్ కుమార్, బి వోకేషనల్ కోర్స్ కోఆర్డినేటర్ వేణుగోపాలరావు, సూపరింటెండెంట్ అనురాధ అభినందించారు.

వాస్తవాలకు వక్ర భాష్యం వద్దు.!



సిఐ ధనుంజయరావు

ప్రజాశక్తి - యలమంచిలి : నిజమైన, ప్రజాహితమైన వార్తలను ప్రచురించాలని, వార్తలకు వక్రభాష్యం చెప్పడం సరికాదని యలమంచిలి సర్కిల్ ఇనస్పెక్టర్ ఎస్. ధనుంజయరావు అన్నారు. శనివారం యలమంచిలి అక్రిడిటేషన్ విలేకర్ల బృందం సిఐని కలిశారు. నేర వార్తలకు సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు పత్రికలకు అందజేయాలని సిఐని కోరగా, ఆయన స్పందిస్తూ, వెంటనే అక్రిడిటేషన్ విలేకర్లతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని రూరల్ పోలీస్ రైటర్‌ను ఆదేశించారు. కొందరు విలేకర్లు అత్సుహంతో వార్తలు రాస్తుంటారని, వారిని అదుపు చేయడం కూడా తమ విధానమన్నారు. నిజం కోసం నిలబడే విలేకర్లకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. టౌన్ ఎస్ఐ. కె.సావిత్రి, రూరల్ ఎస్ఐ. ఎం.ఉపేంద్ర ఉన్నారు.

కొట్టుకుపోయిన డైవర్షన్‌తో రాకపోకలకు ఇక్కట్లు

- వారం రోజులైనా పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు, వాహనదారులు
- తాచేరు వంతెన వద్ద నిత్యం పరేషాన్



తాచేరు వంతెన వద్ద కొట్టుకుపోయిన డైవర్షన్

ప్రజాశక్తి -వడ్డాది :ఇటీవల కురిసిన వర్షాలకు విజయరామరాజుపేట తాచేరు వంతెన కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. వారం రోజులుగా దీన్ని పట్టించుకోకపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు భారీ వర్షాలకు తాచేరు డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోవడంతో, ఈ రోడ్డుపై రవాణాను అధికారులు నిలిపివేశారు దీంతో పాడేరు, అనకాపల్లి,విశాఖ చోడవరం ప్రాంతాల రవాణాకు ప్రజలు తీవ్ర ఇబ్బందులకు ఎదుర్కొంటున్నారు

పాడేరు నుండి నర్సీపట్నం నుండి విశాఖపట్నం వెళ్లాలంటే వడ్డాది వరకు వచ్చి వడ్డాది నుంచి ఆటోలను, ప్రయివేటు వాహనాలను ఆశ్రయించవలసి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. ఇదే అదనుగా ఆటో డ్రైవర్లు ప్రయాణికుల వద్ద నుండి అధిక మొత్తాన్ని వసూలు చేస్తున్నారని స్థానికులు వాపోతున్నారు. అంతేకాకుండా గౌరీపట్నం మీదుగా సింగిల్ రోడ్డు కావడంతో తీవ్ర ట్రాఫిక్‌తో ఆటోలు రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదని అంటున్నారు. స్కూలుకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగాలకు చేస్తున్న ఉద్యోగినిలు తదితరులు సమయానికి విధులకు హాజరు కాలేకపోతున్నారు 108 వాహనాల సైతం ఆ రోడ్డు కుండా వెళ్లాలంటే నరకం అనుభవించవలసిందేనిన వాపోతున్నారు. విజయరామరాజుపేట ప్రజలు సైతం రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వడ్డాది రావాలంటే 15 కిలోమీటర్లు తిరిగి రావలసి వస్తుందని అంటున్నారు .దీంతో పాఠశాలలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు ఉదయం ఆరున్నర గంటలకు బయలుదేరితే కానీ 9 గంటలకు చేరుకోలేని పరిస్థితి ఉందని అంటున్నారు. మరో అల్పపీడన ప్రభావంతో మూడు రోజులు పాటు వర్షాలు పడే అవకాశాలు ఉన్నాయనివాతావరణం శాఖ హెచ్చరికలు జారీ చేస్తున్న నేపథ్యంలో ప్రజలు మరింత ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు స్పందించి తాచేరు వంతెనపై కనీసం కాలినడకన మార్గమైనా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు



డైవర్షన్‌పై నుంచి వెళ్లకుండా అడ్డంగా పెట్టిన కర్రల గేటు

చౌడువాడలో మెగా వైద్య శిబిరం

ప్రజాశక్తి- కె కోటపాడు : సాంస్కృతి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం మండలంలోని చౌడువాడ పిహెచ్‌సి ఆవరణలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలైన మల్లంపాలెం , పాచిలవానిపాలెం , గరుగుబిల్లి, గుల్లేపల్లి, గొండుపాలెం గ్రామాల నుండి వచ్చిన 600 మంది రోగులకు వివిధ రకాల వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను ఉచితంగా అందజేశారు. సంస్కృతి చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు డాక్టర్ శ్రీనివాస్ అండ్ అనురాధ మాట్లాడుతూ విద్య వైద్యానికి తమ ట్రస్టు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. 15ఏళ్లుగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నిరుపేద విద్యార్థులకు లక్షలాది రూపాయల వెచ్చించి పుస్తకాలు ఇతర సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఇతర కమిటీ సభ్యులు ఖాజా, శ్రీనివాస్ , దామోదర్ రెడ్డి , రవికిరణ్ , సత్య, విజయ సహకారంతో పిహెచ్‌సిల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శిబిరంలో వైద్యాధికారులు డాక్టర్ రాజా, డాక్టర్ నిర్మల, డాక్టర్ తరణి, మైత్రి నేత్రాలయ వైద్యులు వైద్య సహాయం అందించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దాడి ఎరుకు నాయుడు ఎంపిటీసీ సభ్యులు రాజేష్ పాల్గొన్నారు.

రాజీ మార్గంలో కేసుల పరిష్కారం శ్రేయస్కరం



మాట్లాడుతున్న జడ్జి రత్నకుమార్

ప్రజాశక్తి -చోడవరం : రాజీమార్గంలో కేసులు పరిష్కరించుకుంటే ఉభయ పార్టీలకు శ్రేయస్కరమని 9వ జిల్లా జడ్జి కె.రత్నకుమార్ అన్నారు. శనివారం చోడవరం కోర్టు సముదాయంలో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోర్టులో కేసులు విచారణ జరిపించుకునే కంటే ఇరువర్గాల వారు రాజీమార్గం అవలంబించి పరిష్కారం చేసుకుంటే మంచిదన్నారు. కోర్టు, పోలీసు, న్యాయవాదులు, న్యాయమూర్తులు, అందరూ వారికి సహాయపడతారని తెలిపారు. ఈ సందర్భంగా పలు కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఇన్చార్జ్ సివిల్ జడ్జి ఇ.రాజేంద్రబాబు, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి స్వర్ణ, అడిషనల్ సివిల్ జడ్జి బి సూర్య కళ, బార్ కౌన్సిల్ అధ్యక్షులు కే డేవిడ్, ప్రభుత్వ న్యాయవాది వెంకట్రావు కోర్టు పరిధిలో ఉన్న పోలీసులు పాల్గొన్నారు.

నక్కపల్లి ఎపిఐఐసి నిర్వాసిత సమస్యలపై 17న ప్రత్యేక గ్రీవెన్స్

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు నక్కపల్లి మండలంలో ఏపీఐఐసీ స్థలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను నిర్వహించనున్నట్లు ఏపీఐఐసీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రమామణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 17న ఉదయం 10గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏపీఐఐసీ స్థలాలకు సంబంధించి ప్రత్యేక గ్రీవెన్స్‌ను జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పాటు చేశామన్నారు. భూమిసేకరణలో నేటి వరకు నష్టపరిహారం అందని రైతులు వారి వద్ద ఉన్న పూర్తి డాక్యుమెంట్ ఆధారాలతో హాజరు కావాలనికోరారు. నర్సీపట్నం రెవిన్యూ డివిజనల్ అధికారి, జెడ్.ఎమ్.,ఏపీఐఐసీ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వారి సిబ్బంది, నక్కపల్లి తాసిల్దార్, వారి సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

విధులు బహిష్కరించి వైద్యుల నిరసన

ప్రజాశక్తి- అచ్యుతాపురం : పిజి వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడానికి వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్తంగా విధులు బహిష్కరణ కార్యక్రమంలో భాగంగా శనివారం అచ్యుతాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు విధులు బహిష్కరించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చిన రోగులు తిరుగు ముఖం పట్టారు. అత్యవసర సేవలకు మనయింపు ఇచ్చి వైద్య సేవలు అందిస్తామన్నారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ ప్రభుత్వంతో జరిపిన చర్చిలు విఫలమయ్యాయన్నారు. డిమాండ్ల పరిష్కారానికి చలో విజయవాడ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ కార్యాలయానికి భారీ ర్యాలీ చేపడతామనితెలిపారు. మంగళవారం నుంచి నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తామన్నారు.

ఎసెన్షియా క్షతగాత్రులకు వైసిపి సాయం అందజేత



నాగభూషణానికి చెక్కు అందజేస్తున్న వైసిపి నేత ప్రసాద్

ప్రజాశక్తి- మునగపాక: అచ్యుతాపురం ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో గాయపడిన మండలంలోని వాడ్రాపల్లి గ్రామానికి చెందిన మల్ల నాగభూషణానికి స్థానిక వైసిపి నాయకులు శనివారం రూ.1 లక్ష చెక్కును అతని స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా వైసిపి అధ్యక్షులు బొడ్డెడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రమాద ఘటనలో గాయపడిన వారికి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అన్నమాట ప్రకారంగా రూ.లక్ష చెక్కులను అందజేసి మాటలు నిలబెట్టుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆడారి గణపతి అచ్చం నాయుడు, వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, కోనపల్లి రామ్మోహన్ రావు, మద్దాల వీరు నాయుడు, పెతకం శెట్టి రామ జోగి నాయుడు, బొడ్డేడ సత్యనారాయణ పాల్గొన్నారు.

కోతుల గుంపులు హల్‌చల్!

- రైతులపై దాడులు చేస్తున్న వానర మూకలు
- పంటల ధ్వంసంపై రైతన్నల ఆవేదన
- రక్షణ చర్యలు చేపట్టాలని వినతి



రహదారిలో గుంపులుగా సంచరిస్తున్న కోతులు

ప్రజాశక్తి -మునగపాక: కోతుల గుంపు నుంచి ప్రజలకు, పంటలకు రక్షణ కల్పించాలని మండల కేంద్రం వాసులు కోరుతున్నారు. అటవీ ప్రాంతం నుంచి గుంపులుగా వచ్చిన కోతులు, ప్రజలపై దాడులకు పాల్పడి, గాయపరచడంతోపాటు, పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు, స్థానికులు వాపోతున్నారు. రైతుల పండించిన అరటి, చెరకు, కొబ్బరి, బొప్పాయి, జామి వంటి పంటలను నష్టపరచడమే కాకుండా పశువుల కోసం తమ పాకాల లో దాచిన పశుగ్రాసాన్ని చెల్లాచెదురు చేసి నష్టపరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఇటీవల కోతుల గుంపు దాడిలో మునగపాక గ్రామానికి చెందిన రైతులు కోయిలాడ సత్తిబాబు, పొలిమేర లక్ష్మి గాయపడ్డారు. అలాగే గ్రామంలో కొత్త మహాలక్ష్మమ్మ గుడి, పాటిదిబ్బ, పేటకట్టు తదితర ప్రాంతాల్లోని రైతు కమతాలలో కోతులు గుంపులుగా సంచరిస్తూ, అటవీ వాతావరణాన్ని తలపించడంతోపాటు విధ్వంసాన్ని సృష్టిస్తున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. రైతులు పొలాలలోకి వెళ్లేందుకు కూడా భయపడే పరిస్థితులున్నాయని, ఒకరిద్దరుగా ఎవరైనా పొలాల్లోకి వెళితే వారిని రైతులను అటకాయించి గాయపరిచి భయాందోళనకు గురిచేస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయని అంటున్నారు.

కాగా ఇటీవల కోతుల బెడద వల్ల రైతులు, పంటలకు జరుగుతున్న నష్టంపై గ్రామ రైతు సంఘం, సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్‌కు వినతిపత్ర సమర్పించి, కోతుల నుండి రక్షణ కల్పించాలని వేడుకున్నా ఎటువంటి స్పందన లేదని సిపిఎం నేత ఎస్ బ్రహ్మాజీ, గ్రామ రైతు సంఘం అధ్యక్షులు ఆడారి మహేష్ అంటున్నారు. ఇంతగా కోతులు హల్‌చల్ చేస్తున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడద నుంచి రైతాంగానికి, పంటలకు రక్షణ కల్పించాలని టిడిపి నాయకులు ఆడారి లక్ష్మణరావు, బాధిత రైతులు బుద్ధ వెంకట్, సత్తిబాబు,పెంటారావు కోరుతున్నారు.

జబర్దస్త్‌తో గుర్తింపు : అప్పారావు

ప్రజాశక్తి- కె.కోటపాడు : జబర్ధస్త్‌తో తనకు మంచి గుర్తింపు వచ్చిందని రంగస్థలం, సినీ, టివి జబర్దస్త్ కళాకారులు రాపేటి అప్పారావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని వారి బంధువుల శ్రద్ధాంజలి కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ, 350 సినిమాలు, 70 పైగా సీరియళ్ళలో నటించానని, 24 ఏళ్లుగా కళారంగానికి సేవలందిస్తున్నారు. 1984 నుండి రంగస్థలం కళాకారుడిగా పౌరాణిక,సాంఘిక నాటకాలు, బుర్రకథ జానపద గీతాలు కోరస్ మిమిక్రీ మొదలైన కళారూపాలను ప్రదర్శించానన్నారు నాటక రంగానికి చెందిన మాదేటి వెంకట లక్ష్మణరావు సినిమా రంగానికి చెందిన లంకా సత్యానందం మాస్టర్ తన తొలి గురువులని అప్పారావు తెలిపారు. తొలిసారిగా జబర్దస్త్ కార్యక్రమానికి భీమరశెట్టి చిన్నికృష్ణ, షకలక శంకర్ గురువుగా తనకు ప్రవేశం కల్పించారని తెలిపారు. రామోజీరావు నిర్మాతగా తీసిన శుభవేళ సినిమా తనకు తొలి చిత్రమని, సరిలేరు నీకెవ్వరు, చందమామ, మహాత్మా, మినుగురులు, వీడు తేడా తదితర సినిమాలు తనకు ఎంతో పేరు ప్రఖ్యాతులను తెచ్చాయన్నారు పీలా మల్లికార్జునరావు, పొట్టి ప్రసాద్ అవార్డులతోపాటు ఉత్తమ హాస్య నటుడి అవార్డు పొందినట్లు తెలిపారు. విశాఖపట్నం అక్కయ్యపాలెం, ఇంకా హైదరాబాదులో నివాసం ఉంటూ జబర్దస్త్ కళాకారుడిగా పనిచేస్తున్నానని, తనను ఆదరించిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు తెలిపారు.

పలుచోట్ల ఘనంగా హిందీ దివస్

ప్రజాశక్తి- కశింకోట : మండలంలో తాళ్ళ పాలెం శ్రీ గాయత్రి పాఠశాలలో శనివారం ఘనంగా హిందీ దివస్ వేడుకలు నిర్వహించినారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థు లకు హిందీ వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హిందీ కవులు వేషధారణలో విద్యార్థులు అలరించారుకార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బి. రామ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు వై. నగేష్ పాఠశాల యజమాని సభ్యులు ఐ .అప్పారావు, హిందీ ఉపాధ్యాయులు ఏ. విజయ్ దుర, కే. వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

వడ్డాది : ప్రపంచ దేశాల్లో హిందీ అతి ముఖ్యమైన భాషని వడ్డాది జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వైవిఎల్ అన్నపూర్ణ తెలిపారు. వడ్డాది ప్రభుత్వ జూనియర్ కళాశాల లో శనివారం హిందీ దివస్ నిర్వహించారు. కళాశాల హిందీ అధ్యాపకులు ఇ.నరసింహమూర్తి, అధ్యాపకులు ప్రభ, నారిబాబు విజయకుమార్, విద్యార్థుల పాల్గొన్నారు.

అడ్డురోడ్డులో ప్రయాణం..అవస్థలమయం...

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల వాసులకు అడ్డురోడ్డు ప్రయాణం నరక ప్రాయంగా కావడంతో ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. మండలం నుంచి అడ్డరోడ్డు వెళ్లాలంటే రోడ్డు సదుపాయం సక్రమంగా లేక పోవడంతో ప్రయాణికుల జేబులతో పాటు శరీరం కూడా గుల్ల అవుతున్న పరిస్థితి నెలకొంది. రామచంద్రపురం సమీపంలో వంతెన కుంగిపోవడం, ఆటో సదుపాయం బస్సు సదుపాయం సక్రమంగా లేక గడిచిన వారం రోజులుగా ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ఇందేశమ్మ వాక సమీపంలో రోడ్డు కోతకు గురికావడంతో పాటు ఎగువ నుండి బండ రాళ్లు కొండ చరియలు విరిగి పడుతూ ఉండడంతో ప్రయాణం మరింత నరకప్రాయంగా తయారైంది. ఇక పందూరు నుండి అడ్డరోడ్డు వరకు రోడ్డు పరిస్థితి చూస్తే ఉయ్యాల జంపాల మాదిరిగానే ఉంటుంది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో అడ్డరోడ్డు నుంచి కోటవురట్ల వచ్చేందుకు బస్సు, లేదా ఆటోకు 30 రూపాయలు ఛార్జ్ తీసుకునేవారు. ప్రస్తుతం అడ్డ రోడ్డు నుండి కోటవురట్ల వచ్చేందుకు రోడ్డు సదుపాయం లేక పోవడంతో రెండు ఆటోలు మారాల్సిన పరిస్థితి నెలకొంది. దీన్ని ఆసరాగా చేసుకుని అడ్డ రోడ్డు నుండి రామచంద్రపురం వరకు 50 రూపాయలు, అక్కడి నుండి కోటవురట్లకు 50 రూపాయలు చార్జీలు ముక్కు పిండి వసూలు చేస్తున్న పరిస్థితి నెలకొంది. దీంతో, ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం విశేషం, వంతెన కుంగిన సందర్భంలో మంత్రి అనిత, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ సందర్శించి రెండు రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వారం రోజులు పూర్తిగా కావస్తున్నా నేటికీ డైవర్షన్ పనులు చేపట్టకపోవడం పట్ల ప్రయాణికులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు, అధికారులు త్వరితగతిన డైవర్షన్ పనులు పూర్తిచేసి, శాశ్వత వంతెన నిర్మాణం పనులు చేపట్టాలని ప్రయాణికులు మండల వాసులు కోరుకుంటున్నారు.



గోతులమయంగా ఉన్న రహదారి



నత్తనడకన సాగుతున్న డై వర్షన్ రోడ్డు పనులు

సిఐ, ఎస్ఐలు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోట సర్కిల్ పరిధిలో కొత్తకోట ఎస్సైగా యం.శ్రీనివాసరావు, రావికమతం ఎస్సైగా రఘువర్మలు శనివారం బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీలలో భాగంగా అనకాపల్లి కంట్రోల్ రూమ్ పిఆర్ సి విభాగంలో పనిచేస్తున్న శ్రీనివాసరావు కొత్తకోట పోలీసు స్టేషన్ కు బదిలీ పై రాగా ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన లక్ష్మణరావు కశింకోట బదిలీ పై వెళ్లారు. అలాగే అనకాపల్లి డబ్ల్యు పిసి విభాగంలో పనిచేస్తున్న రఘువర్మ రావికమతం పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ధనుంజయ నాయుడును అనకాపల్లి విఆర్‌కు బదిలీ చేసారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తామని, గ్రామాలలో ఆ సాంఘిక,చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే కేసులు నమోదు తప్పవని హెచ్చరించారు. నాటు సారా తయారీ, గంజాయి అక్రమ రవాణా వంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పిడితే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.. వీరికి ఆయా పోలీసు స్టేషన్ సిబ్బంది ఘనంగా స్వాగతం పలికారు...

నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం రూరల్ సీఐగా ఎల్.రేవతమ్మ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గంజాయి రవాణా, నాటుసారా నిర్మూలనకు తమ వంతు బాధ్యత వహిస్తానన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన సీఐను సర్కిల్ పరిధిలోని ఎస్సైను కలిసి శు భాకాంక్షలు తెలియజేశారు.



పంట నష్టం అంచనా వేస్తున్న అధికారులు

220 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి -నక్కపల్లి:తుఫాన్ ప్రభావంగా ఇటీవల కురిసిన వర్షాలకు నక్కపల్లి మండలంలో 220 ఎకరాల వరి పంట నీటి మునిగి నష్టం వాటిల్లినట్లు తహసీల్దార్ అంబేద్కర్, వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ తెలిపారు. మండలంలో సాధారణ సాగు 4400 కాగా 4480 ఎకరాల్లో వరి సాగు అయినట్లు తెలిపారు .గ్రామ కమిటీలు గ్రామ రెవెన్యూ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ సర్వేయర్ ద్వారా నీటి ముంపునకు గురైన పొలాలను పరిశీలించి నష్టం అంచనా వేసినట్లు తెలిపారు. 33శాతం పైన దెబ్బతిన్న వరి కు హెక్టారు కు 17,000 రూపాయలు చొప్పున పరిహారం అందుతుందన్నారు. పంట నష్టం జాబితా లో 230 మంది రైతుల పేర్లను నమోదు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపించడం జరిగిందని వెల్లడించారు.



స్థలాల మ్యాపును పరిశీలిస్తున్న బండారు

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - చీడికాడ:పరిశ్రమలు ఏర్పాటయితే ఉపాధి అవకాశాలతో పాటు ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందు తాయని మాడుగుల నియోజకవర్గం ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు. మాడుగుల నియోజకవర్గంలోని చీడికాడ మండలంలో ఎంఈఎం ఎస్ పరిశ్రమల ఏర్పాటుకు స్థల సేకరణకు గాను శనివారం మండలంలోని అడవిల అగ్రహారం ప్రాంతంలో భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏ ప్రాంతం అయినా అభివృద్ధి చెందాలంటే పరిశ్రమలతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాడుగుల నియోజకవర్గానికి రెండు పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తానని గతంలో హామీ ఇచ్చారని, ఆ హామీ ప్రస్తుతం నెరవేరుస్తున్నారన్నారు. ఆయన ఆదేశాల మేరకు మాడుగుల నియోజకవర్గంలోని ఆర్లిలో ఇటీవల స్థల పరిశీలన జరిగిందని, చీడికాడ మండలంలోని అడవుల అగ్రహారంలో పరిశీలిస్తున్నామన్నారు. ఇక్కడ పరిశ్రమలు ఏర్పాటు చేస్తే వేలాదిమంది యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రామానాయుడు, టిడిపి నాయకులు పైల ప్రసాదరావు, గ్రామ సర్పంచ్ సూరి నాయుడు, ఎంపీటీసీలు, రెవెన్యూ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా

ప్రజాశక్తి-కోటవురట్ల:మండలంలో రాజుపేట గ్రామం సర్ప నది నుండి నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుండటంతో తహసిల్దార్ జానకమ్మ రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. శనివారం తెల్లవారు జామున రాజుపేట గ్రామం నుండి నిల్వ చేసిన ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తరలిస్తూ ఉండగా స్థానిక గ్రామ రెవెన్యూ అధికారి అనూష, చౌడువాడ గ్రామ రెవెన్యూ అధికారి రమేష్ ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను స్థానిక పోలీస్ స్టేషన్కు అప్పగించారు, తహసిల్దార్ ఆదేశాల మేరకు పట్టుబడ్డ ట్రాక్టర్ల పై చర్యలు తీసుకుంటామని పోలీస్ రెవెన్యూ అధికారులు తెలిపారు

కాగా రాజుపేట పరిసర ప్రాంతాల నుండి రాత్రి సమయంలో నిరంతరాయంగా టైరు బళ్ళు ద్వారా నిలవచేసుకున్న ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తూ ఉండడం విశేషం. ఒక్కో టైరు బండి ఇసుకకు ట్రాక్టర్ల యజమానులు ఎనిమిది వందల చొప్పున కొనుగోలు చేస్తున్నట్టు సమాచారం, రాజుపేట, జంగాలపల్లి, రామన్నపాలెం, సహ మాకవరపాలెం మండలం పలు గ్రామాల టైరు బళ్ళ ద్వారా నిరంతరాయంగా ఇసుకను తరలిస్తున్నారు. , మాకవరపాలెం మండలానికి చెందిన ట్రాక్టర్లు మాకవరపాలెం నర్సీపట్నం సహా ఇతర ప్రాంతాలకు నిలువ చేసిన ఇసుకను తరలిస్తున్నారు. ఒక్కో ట్రాక్టర్ 6000 చొప్పున అమ్ముతున్నట్లు తెలిసింది. పలుమార్లు పోలీసులు రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించినా నిత్యకృత్యంగా వ్యాపారం సాగిస్తున్నారు, సర్ప నది పరివాహక ప్రాంత రైతులు ఇసుక తరలింపు పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట భూములు కోతకు గురవుతున్నాయని అధికారులకు పలుమార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో ఇష్టా రాజ్యంగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. అధికారులు కఠినమైన చర్యలు చేపట్టాలని స్థానికులు సర్పనది పరివాహక ప్రాంత రైతులు కోరుకుంటున్నారు.

ట్రాక్టర్లు స్వాధీనం



పట్టుబడ్డ ట్రాక్టర్లు



చెక్కు అందజేస్తున్న స్పీకర్ అయ్యన్న

రూ.2 లక్షల బీమా చెక్ అందజేత

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం జీ.కొత్తూరు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్త కొండ్రపు సత్తిబాబు జూన్ 25న జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. తెలుగు దేశం పార్టీ సభ్యత్వం ఉన్న సత్తిబాబు కుటుంబానికి ప్రమాద భీమా కింద తెలుగు దేశం పార్టీ కార్యాలయం నుండి ఆయన కుమార్తె రాముకు రెండు లక్షల రూపాయల బ్యాంక్ చెక్‌ను స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి రవివర్మ, టిడిపి మండల కమిటీ సభ్యులు గోవిందరాజు, రామరాజు, బాబులు తదితరులు పాల్గొన్నారు.

ఫామ్ ఆయిల్ సాగుపై అవగాహన

ప్రజాశక్తి-నాతవరం: మండలంలోని చిన్న జగ్గంపేట గ్రామంలో పతంజలి కంపెనీ ఆధ్వర్యంలో ఫామ్ ఆయిల్ తోటలు సాగుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ మేనేజర్ తోట రామచందర్ మాట్లాడుతూ, పంట ఆవశ్యకత, రాయితీలు, దిగుమతులపై వివరించారు. అనంతరం అసిస్టెంట్ మేనేజర్ కె.రమేష్, ఫీల్డ్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ, పంట యాజమాన్య పద్ధతులు వివరించి రైతుల సందేహాలను నివృతి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు గాడి శ్రీరామ్ మూర్తి, పైల పోతురాజు ,జి .రాజుబాబు తదితరులు పంట అనుభవాలను వివరించారు.



అవగాహన కల్పిస్తున్న సంస్థ ప్రతినిధి

స్పీకర్‌ను కలిసిన రూరల్ సిఐ రేవతమ్మ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నర్సీపట్నం రూరల్ సీఐగా బాధ్యతలు చేపట్టిన ఎల్.రేవతమ్మ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మర్యాద పూర్వకంగా కలుసు కున్నారు. ఈ సందర్భంగా సీఐ శాంతిభద్రతల విషయమై చర్చించారు. ఈ కార్యక్రమంలో టౌన్ ఎస్సై ఉమామహేశ్వరరావు, మాకవరపాలెం ఎస్సై దామోదర్ నాయుడు, గొలుగొండ ఎస్సై రామారావు, కృష్ణదేవిపేట ఎస్సై దివ్యలు కూడా పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛాన్ని ఇస్తున్న సిఐ

తాగునీరు సరఫరా

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల కేంద్రంలో తాగునీటి సమస్యపై శుక్రవారం సచివాలయం వద్ద మహిళలు నిరసన వ్యక్తం చేయడంతో శనివారం గ్రామ కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామీణ నీటి సరఫరా అధికారిని గీతాంజలి స్పందించారు. సమస్యను పరిష్కరించి నీటి సరఫరా చేపట్టడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు, ఈ సందర్భంగా గ్రామీణ నీటి సరఫరా అధికారిని గీతాంజలి మాట్లాడుతూ, వరాహనదికి అవతల వైపు ఉన్న పంపు హౌస్ నుంచి వచ్చే పైపులైను వరాహ నదిలో నది ఉధృతికి తెగిపోవడంతో సమస్య ఏర్పడిందన్నారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా అంగన్వాడి సెంటర్ వద్ద ఉన్న బోర్ల నుండి ట్యాంకుకు పంపింగ్ చేస్తున్నామని తెలిపారు, వరాహనది నీటి ఉధృతి ఎక్కువగా ఉన్న కారణంగా పైపులైను పనులు చేపట్టేందుకు కుదరక పోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని, శాశ్వత పరిష్కారం కోసం పైపులైను పనులు వేరే ప్రాంతం నుంచి చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్య పునరావృతం కాకుండా పనులు చేపడతామని ఈ సందర్భంగా తెలిపారు.


పైప్‌లైన్ మరమ్మతు చేయిస్తున్న అధికారులు

చిరస్మరణీయుడు.. సీతారాం ఏచూరి


చీడికాడలో నివాళులర్పిస్తున్న నేతలు, మహిళలు

ప్రజాశక్తి -నక్కపల్లి: సిపిఎం ఆలిండియా ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి, వామ పక్ష ఉద్యమాలకు తీరని నష్టమని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.అప్పలరాజు అన్నారు. సీతారాం ఏచూరి గొప్ప మేధావి, రచయిత, గొప్ప వక్త, మానవతావాది అని కొనియాడారు.పాయకరావుపేటలో శనివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎకనామిక్స్ విశ్రాంతి లెక్చరర్ సీతారామమూర్తి మాట్లాడుతూ, భారత దేశ కమ్యూనిస్టు చరిత్రలో సీతారాం ఏచూరి చెరగని ముద్ర వేసారని, ఆయన విద్యార్థి దశ నుంచి దేశంలో అనేక ఉద్యమాలు నిర్వహించారన్నారు. దేశం లో అనేక అంశాలపై పూర్తి అవగాహన ఉన్న నాయకుడని ఆయన మరణం దేశానికి కూడా లోటు అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.నాగేశ్వరరావు, ఎం.రాజేష్,ఎన్‌టి సీతారామమూర్తి, జీ.తాళ్ళరావు, జీ.వి.రమణ, వీర్రాజు, ఆచారి తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ:సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి కామ్రేడ్ సీతారం ఏచూరి మృతికి సంతాపం తెలియజేస్తూ చీడికాడలో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్ళర్పించారు.అనంతరం సిఐటియు డివిజన్ కార్యదర్శి ఆర్ దేముడు నాయుడు, అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు యం జానకి మాట్లాడుతూ, సీతారాం ఏచూరి మృతి చెందడం పార్టీ కి, దేశానికి తీరని లోటన్నారు. ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారని తెలిపారు విద్యార్థి ఉద్యమం నుంచి నాయకత్వ స్థానంలోకి వచ్చిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి నాయకుడిగా ఎదిగారని అన్నారు. విశాఖలో జరిగిన జాతీయ మహాసభల్లో జాతీయ ప్రధాన కార్యదర్శి ఎన్నికయ్యారని అన్నారు. విశాఖ జిల్లాలో ఉన్న ప్రభుత్వరంగ పరిశ్రమల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాజ్యసభలో లేవ నెత్తడమే కాకుండా వాటిని ప్రభుత్వరంగంలోనే కొనసాగేందుకు విశేషమై కృషి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పి రాజులమ్మ, బి ఉమా, చిన్న తల్లి, మీనా కుమారి, సత్యవతి, తదితరులు పాల్గొంటున్నారు.


పరవాడలో..

మాడుగుల : మాడుగుల కేంద్రం కనికరమాత కాలనీలో సీతారాం ఏచూరికి నివాళులర్పించారు. అయన చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి ఇరట నరసింహమూర్తి, మండల నాయకురాలు కె.భవానిలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీతారాం ఏచూరి కమ్యూనిస్టు ఉద్యమంలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. భారత రాజకీయాలకు సీతారాం ఏచూరి మార్గదర్శకంగా వ్యవహరించారన్నారు.దేశ ప్రజలు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తరుణంలో సీతారాం ఏచూరి లేకపోవడం బాధాకరమన్నారు.ఈ కార్యక్రమంలో బొట్టా కన్నారావు, బట్ట సుశీల, జలుమూరు నూకరత్నం, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని రాయన్నపాలెం, కోడాపల్లి, పూలగరువు, ఇప్పగరువు దేవరాపల్లి, వాలాబు గ్రామాల్లో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు మేధావి సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు.


నక్కపల్లిలో..

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు డి వెంకన్న, మండల కార్యదర్శి బిటి దొర, సిహెచ్ లక్ష్మణ, సిహెచ్ ఈశ్వరరావు లక్ష్మీ గంగులు కె సుదాకర్ దేముడు పి గంగరాజు సిహెచ్ రాంబాబు, కె శ్రీను సిహెచ్ చంద్రరావు కె పెరయ్య బిమ్మాలమ్మ పాల్గొన్నారు


వడ్డాదిలో...

చోడవరం : చోడవరం సిఐటియు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి మృతికి సంతాపంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి వరలక్ష్మి, జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, సిపిఎం మండల నాయకులు ఎస్‌వి నాయుడు, సిఐటియు అంగన్వాడి ఆశ మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు

వడ్డాది : మండలంలోని బంగారుమెట్టలో సిపిఎం మండల కార్యదర్శి పినపాత్రుని సాంబశివరావు ఆధ్వర్యంలో సీతారాం ఏచూరి మృతికి సంతాపం తెలిపారు. ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. మాజీ సర్పంచ్ ఎస్.నానాజీ, యూత్ లీడర్ బైన మణికంఠ,బత్తుల శ్రీను,సోషల్ వర్కర్ ఆరిపాక కామేశ్వరరావు పాల్గొన్నారు.

పరవాడ: స్థానిక సిఐటియు కార్యాలయంలో సిఐటియు ఆధ్వర్యంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి ఘనమైన నివాళులర్పించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సిఐటియు నేత సిహెచ్ దేవి పూలమాలవేసి నివాళులర్పించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ, సిఐటియు నాయకులు రామలక్ష్మి, బి లక్ష్మి, అరుణ, పార్వతి పాల్గొన్నారు.


మాడుగులలో...

కశింకోట : మండలంలో తాళ్లపాలెం గ్రామంలో సీతారాం ఏచూరి మృతికి ముఠా కార్మికులు యూనియన్ (సిఐటియు అనుబంధం), ప్రజా సంఘాల నాయకులు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఠా కార్మికులు ఎం.సత్తిబాబు, బి. నూకరాజు, కే.నాగరాజు, బెన్నయ్య, అప్పలనాయుడు, ఎన్‌పిఆర్‌డి. యూనియన్ మండల అధ్యక్షుడు ఎస్.కె రెహమాన్, ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి. వరలక్ష్మి, సి.పి.ఎం. నాయకులు దాకారపు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : మండలంలోని తిమ్మరాజుపేట గ్రామంలో సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, సిపిఎం నాయకులు బుద్ధ రంగారావు, శరగడం రాము నాయుడు సొంటేనా బ్రహ్మాజీ, కర్రి నాగు, ఆడారి జగ్గా అప్పారావు, ఐతంశెట్టి అప్పారావు , వెలగా గోవిందా, అప్పల బత్తుల ఆచారి పాల్గొన్నారు.

ఉక్కునగరం: నిజాయితీ నిబద్ధతతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన సీతారాం ఏచూరి వంటి నాయకుల జీవిత గాధలు ఎంతోమందికి ఆదర్శప్రాయమని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అన్నారు. శుక్రవారం స్టీల్‌ప్లాంట్ సిఐటియు కార్యాలయంలో ఏచూరి సంస్మరణ సభలో ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో


చోడవరంలో..

సిఐటియు నాయకులు పి వి ఎస్ బి శ్రీనివాసరాజు యు రామస్వామి, ఎన్ రామారావు పాల్గొన్నారు.

గాజువాక : యువతకు సీతారాం ఏచూరి ఒక రోల్ మోడల్ అని తోకాడ సమైక్య అపార్ట్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన ఏచూరి సంతాపసభ లో ముందుగా ఏచూరి చిత్రపటానికి అపార్ట్‌మెంట్ వాసులు, అసోసియేషన్ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సంతాపంగా కొద్దిసేపు మౌనం పాటించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, కమ్యూనిస్ట్‌పార్టీని అంతర్జాతీయంగా ఉన్నతశిఖరాల్లో నిలిపేందుకు తనదైన కృషి చేసిన ఏచూరి, మరణానంతరం ప్రజోపయోగానికి తన పార్థివదేహాన్ని దానం చేశారన్నారు. ఒడిశా పర్లాకిమిడి ఎన్నికల సభకు వెళ్లినపుడు ఆయనతో తాను వెళ్లిన సందర్భాన్ని స్మృతిగా గుర్తు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి ఎ.తవిటయ్య, ఎంవి రమణ, శ్రీనివాస్ చౌదరి, రామన్న, తౌడన్న, మహిళా కమిటీ సభ్యులు మణి, వరలక్ష్మి, పద్మ పాల్గొన్నారు.

ఎతగరపువలస : సిపిఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. ఆయన మృతికి సంతాప సూచకంగా చిట్టివలస జిఆర్.భవన్‌లో శనివారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా ఏచూరి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఏచూరి మృతికి సంతాపం, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ భీమిలి ఏరియా కార్యదర్శి కానూరి రాంబాబు, సిపిఐ, ఎఐటియుసి నాయకులు అల్లు బాబూరావు, ఎం.అప్పలరాజు, కొండపు ఈశ్వరరావు, మాజీ కౌన్సిలర్ ఎం.సన్యాసమ్మ తదితరులు పాల్గొన్నారు.


తోకాడ సమైక్య అపార్టుమెంట్ అసోసియేషన్ సభ్యుల నివాళి